ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 26.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 337 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



భారత్‌కు అసలైన పరీక్ష 10

నేపాల్‌లో గణపతి

తీవ్ర అనారోగ్యంతో మావోయిస్టు అగ్రనేత

ఓ ఆశ్రమంలో ఉన్నట్లు గుర్తించిన తెలంగాణ పోలీసులు

- ప్రాణానికి హాని కలిగించబోమనే హామీ
- లొంగిపోవాలని పోలీసుల ప్రతిపాదన
- కేంద్ర బలగాలకు లొంగిపోయే ప్రసక్తే లేదన్న గణపతి
- తెలంగాణ పోలీసులకు సరెండర్ కు మొగ్గు!
- ముందు ఆయన భార్య జోడె రత్నాబాయి అలియాస్ సుజాతక్క సహా పలువురి లొంగుబాటు
- మిగిలిన జీవితం తమతో గడపాలి
- గణపతికి సోదరుడు రాంచంద్రారావు విజ్ఞప్తి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 25: మావోయిస్టు పార్టీ అగ్రనేతల లొంగుబాటు అనంతరం ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్‌గణపతి ఎక్కడున్నారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఆయన ఆచూకీ కోసం గత కొన్ని నెలలుగా కేంద్ర, రాష్ట్రాల ఇంటెలిజెన్స్ పోలీసులు ముమ్మరంగా వేట కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు లొంగిపోయిన నేతల నుంచి అందిన సమాచారంలో ఆయన ఎక్కడ ఉన్నారు?, ఎలాంటి స్థితిలో ఉన్నారో తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులకు స్పష్టత వచ్చినట్ల తెలుస్తోంది. నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయం సమీపంలోని ఒక ఆశ్రమంలో ఆయన ఉన్నట్లు గుర్తించిన తెలంగాణ పోలీసులు అక్కడికి చేరుకుని గణపతికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తీసుకున్నారు. ఆశ్రమంలో ఉంటున్న గణపతిని తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులు సంప్రదించినట్లు తెలిసింది. తాజా ఆరోగ్య సమస్యల రీత్యా ఎక్కడికీ కదలలేని స్థితిలో ఉన్నందున ఆయనతో చాలా విషయాలను కూడా ప్రస్తావించినట్లు సమాచారం. పార్టీలోని తాజా పరిస్థితులపై గణపతికి పూర్తి స్థాయిలో సమాచారం లేదని, వివరించిన తర్వాత మానసిక స్థితి రీత్యా స్పందన కూడా అంతంత మాత్రంగానే ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆయన ప్రాణానికి హాని కలిగించబోమనే హామీతో పాటు సరెండర్ కావాలన్న ప్రతిపాదనను ఆయన ముందు ఉంచినట్లు తెలిసింది. కేంద్ర భద్రతా బలగాలకు ఎట్టి పరిస్థితిలో లొంగిపోయే ప్రసక్తే లేదని, తెలంగాణ పోలీసులు దగ్గర సరెండర్ కావడానికి మొగ్గు చూపినట్లు

...:: మిగతా 2లో

రాష్ట్రంలోని లబ్ధిదారులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆసరా పింఛన్ల పెంపు, మహాలక్ష్మి పథకం (నగదు సాయం), విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ వంటి అంశాలపై ప్రభుత్వం త్వరలో స్పష్టత ఇవ్వనుంది. మార్చి బడ్జెట్ సమావేశాల్లో వీటికి నిధులు కేటాయించి, అధికారికంగా ప్రారంభించనున్నట్లు సమాచారం. నిధుల అందుబాటుపై ఆర్థిక శాఖ ఇప్పటికే సీఎంకు నివేదించించినట్లు తెలుస్తోంది.

ఆసరా పింఛన్లు డబుల్



పేద మహిళలకు రూ. 2500.. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

- మూడు కీలక పథకాలకు బడ్జెట్లో నిధులు
- హామీల అమలుపై రేవంత్‌సర్కార్‌దృష్టి
- ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు
- ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా పథకాలు అమలు
- త్వరలోనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నప్రభుత్వం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 25: మూడు కీలక పథకాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో పలు గ్యారంటీలను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోంది. అయితే త్వరలోనే ఆసరా ఫించన్లు పెంపుతో పాటు నిరుపేద మహిళలకు నెలకు రూ. 2500 ఆర్థిక సాయం అందించేందుకు కసరత్తు ప్రారంభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని, ఉన్నది ఉన్నట్లు బహిరంగంగా ప్రజలకు వివరిస్తున్న ముఖ్యమంత్రి ఆసరా ఫించన్లు పెంచేందుకు నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రంలోని లబ్ధిదారులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆసరా పింఛన్ల పెంపు, మహాలక్ష్మి పథకం (నగదు సాయం), విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ వంటి అంశాలపై ప్రభుత్వం త్వరలో స్పష్టత ఇవ్వనుంది. మార్చి బడ్జెట్ సమావేశాల్లో వీటికి నిధులు కేటాయించి, అధికారికంగా ప్రారంభించనున్నట్లు సమాచారం. నిధుల అందుబాటుపై ఆర్థిక శాఖ ఇప్పటికే సీఎంకు నివేదించించినట్లు తెలుస్తోంది.

మూడు కీలక పథకాలకు బడ్జెట్లో నిధులు

ఆసరా పించన్ల పెంపు, మహాలక్ష్మి పథకం (నగదు సాయం), విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ వంటి పథకాలకు

...:: మిగతా 2లో



'న్యాయ వ్యవస్థలో అవినీతి'పై 8వ తరగతి బుక్‌లో ఛాప్టర్

- తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు
- సుమోటోగా స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం

...:: 9లో



మాన్యుఫాక్చరింగ్ రంగంలో తెలంగాణను శక్తివంతంగా తీర్చిదిద్దాలి

- అందుకు ప్రణాళికలు రూపొందించాలి
- అడోబ్ సీఈఓ శంతనుతో సీఎం భేటీ
- పలు కీలక అంశాలపై ఇరువురి చర్చ
- తెలంగాణను అభివృద్ధిలో సహకరించాలని వినతి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 25: మాన్యుఫాక్చరింగ్ రంగంలో తెలంగాణను శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు, ప్రముఖ సంస్థలను ఆకర్షించడానికి సరైన ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, యువతకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ వంటి అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడోబ్ సీఈఓ, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ బోర్డు సభ్యులు శంతను నారాయణ్ తో

...:: మిగతా 2లో

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఉపేక్షించరాదు

- ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో చరిత్రాత్మక ప్రసంగం
- భారత్ కష్టకాలంలో ఉన్న ప్రతిసారి ఇజ్రాయెల్ అండగా నిలిచింది
- మోడీ స్నేహితుడి కంటే ఎక్కువ నా సోదరుడు
- భారత్‌తో ఇజ్రాయెల్ మధ్య వాణిజ్య ఒప్పందాలు రెట్టింపు
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వెల్లడి

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ప్రపంచంలో ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఉపేక్షించరాదని ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. రెండు రోజుల ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోడీ ఆ దేశ పార్లమెంట్‌లో చరిత్రాత్మక ప్రసంగం చేశారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో మాట్లాడిన భారత తొలి ప్రధానిగా రికార్డు సృష్టించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ సభ్యుల హర్షధ్వానాల మధ్య ఉద్వేగభరిత ప్రసంగం చేసిన ప్రధాని మోడీ ఇరుదేశాల సంబంధాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఇజ్రాయెట్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ చేసిన కృషి ఆమోఘమని చెప్పారు. భారత్ కష్టకాలంలో ఉన్న ప్రతిసారి ఇజ్రాయెల్ ఒక మంచి స్నేహితుడి మాదిరిగా అండగా నిలిచిందని చెప్పారు. అన్ని వైపుల నుంచి ఒత్తిళ్లను అధిగమించి భారత్‌కు భరోసాను ఇచ్చిందన్నారు. భారత్

...:: మిగతా 2లో





కుమ్మెర ఘటన అమానుషం

- పసిపాపై చనిపోయినా న్యాయం చేయడం లేదు
- బిడ్డతో పాటు రాజ్యాంగాన్ని కూడా ఖననం చేశారు
- పోలీసులకు జీతాలు ఇచ్చేది రాష్ట్ర ప్రజలు.. రేవంత్ కాదు
- ఘటనపై అసెంబ్లీలో మాట్లాడుతా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ఆగ్రహం
- పసిపాప కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్‌నేత
- బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ

ప్రతిపక్షం, నాగర్‌కర్నూల్

ఫిబ్రవరి 25: కుమ్మెర మల్లన్న జాతర ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు, నాగర్‌కర్నూల్ పోలీస్ యంత్రాంగం తీరుపై మండిపడ్డారు. ఇది రాజకీయాలు

...:: మిగతా 2లో

తహసీల్దార్, ఆర్డీవో ఆఫీసులకు శాశ్వత భవనాలు

- మొదటి దశలో 60 తహసీల్దార్, 5 ఆర్డీవో కార్యాలయాలకు భవనాలు
- రెండవ విడతలో 170 కార్యాలయాల నిర్మాణం
- రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాలో అన్ని భవనాలు
- ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్
- రిజిస్ట్రేషన్ శాఖలో సమీకృత భవనాల నిర్మాణం
- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొదటి దశలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రెండవ విడతలో శిధిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోచర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిధిలావస్థ,



పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. "ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలి" అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతో పాటు

...:: మిగతా 2లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.27 (గురువారం సాయంత్రం)

సహర్ – 5.14 (శుక్రవారం ఉదయం)



భారత్, పాక్ అణు యుద్ధాన్ని నేనే ఆపా

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను కనుక తాను ఆపకపోయి ఉంటే 3.5 కోట్ల మంది ప్రజలు మరణించి ఉండే వారని పాక్ ప్రధాని షరీఫ్ తనతో పేర్కొన్నారని తెలిపారు.


9



మోడీ నా సవాల్ స్వీకచరించలేదు

భారత్-అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్నిరద్దు చేయాలని తాను సవాల్ విసిరి 24 గంటలు దాటినా మోదీ స్పందించలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తన సవాల్ స్వీకరించలేక, మోదీ మరోసారి సైలెంట్ గా ఇజ్రాయెల్ వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు.

9



మీడియా అకాడమీ ఛైర్మన్ పదవీకాలం పొడిగింపు

తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్‌గా సీనియర్ పాత్రికేయులు కె. శ్రీనివాస్ రెడ్డి పదవీకాలాన్ని ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరో 2 సంవత్సరాలు కె. శ్రీనివాస్ రెడ్డి మీడియా అకాడమీ ఛైర్మన్‌గా కొనసాగనున్నారు.

2

నేపాల్‌లో గణపతి

మొదటిపేజీ తరువాయి

సమాచారం. ఆయనను పోలీసులు ఈ వారంలోనే తెలంగాణకు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. దీనికంటే ముందే ఆయన భార్య జోడె రత్నాబాయి అలియాస్ సుజాతక్క సహా పలువురి సరెండర్‌ను లేదా అరెస్టును తెలంగాణ పోలీసులు ప్రకటించనున్నట్లు సమాచారం.

తీవ్ర అనారోగ్య సమస్యలతో..

గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గణపతి వైద్య చికిత్స నిమిత్తం అడవిని వీడారు. ఆపరేషన్ కగార్‌పై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్న సందర్భంగానే ఆయన నేపాల్‌కు చేరుకున్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర పోలీసులకు మాత్రం ఈ సమాచారం చాలా ఆలస్యంగా తెలిసింది. మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు పోలీసుల అదుపులోకి వచ్చి సరెండర్ కావడానికి ముందే గణపతికి సంబంధించిన వివరాలన్నింటినీ కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు సేకరించినట్లు సమాచారం. కొన్ని వారాల క్రితం నేపాల్‌లోని ఓ ఆశ్రమంలో మెడిటేషన్, మెడికేషన్ తీసుకుంటున్నట్లు వివరాలు అందాయి. అప్పటి నుంచీ ఆయనపై నిఘా కొనసాగుతూనే ఉన్నది. అనేక రకాల అనారోగ్య సమస్యలతో పాటు వృద్ధాప్యానికి సంబంధించిన ఇబ్బందులు కూడా ఉన్నాయని, మంచానికి మాత్రమే పరిమితమయ్యారన్నది తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసుల సమాచారం.

మిగిలిన జీవితం మాతో గడపాలి

గణపతికి సోదరుడు

రాంచంద్రారావు విజ్ఞప్తి

దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీని తన కనుసన్నల్లో నడిపి.. ప్రస్తుతం వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు వెంటనే పోలీసుల ఎదుట లొంగిపోవాలని ఆయన కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. మిగిలిన జీవితం తమతో గడపాలని గణపతికి సోదరుడు రాంచంద్రారావు విజ్ఞప్తి చేశారు. గణపతి కోసం ఊరు, కుటుంబం అంతా ఎదురు చూస్తోందన్నారు. తన సోదరుడు గణపతికి ఎటువంటి హాని తలపెట్టవద్దని ఈ సందర్భంగా పోలీసులను కోరారు. తన సోదరుడు గణపతి నేపాల్‌లో ఉన్నారని.. పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తల్లో చూశానని ఈ సందర్భంగా రాంచంద్రరావు పేర్కొన్నారు. పుట్టిన గడ్డ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో కొట్లాడాలంటూ గణపతికి మీడియా ద్వారా సోదరుడు సూచించారు. 43 ఏళ్ల నుంచి నీ కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. మావోయిస్టులంతా లొంగిపోయారని.. నువ్వు కూడా లొంగిపోవాలంటూ సోదరుడుకి రాంచంద్రారావు హితవు పలికారు.

ఆసరా పింఛన్లు డబుల్

మొదటిపేజీ తరువాయి

ఈ బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించనున్నట్లు సమాచారం. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశాలు మార్చి 16నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 20న ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఇతర కేటగిరీలకు ఇస్తున్న ఆసరా పింఛన్‌ను మేనిఫెస్టో హామీ ప్రకారం రూ. 4,000కు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం వీరికి ₹2,016 అందుతుండగా, దీనిని రెట్టింపు చేయడం వల్ల సుమారు 44 లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. దీనికోసం ఏటా అదనంగా ₹11,000 కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని ఆర్థిక శాఖ అంచనా వేసింది. ఏప్రిల్ 2026నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పెంపును అమలు చేసే అవకాశం ఉంది. అయితే ముందుగా రూ.వెయ్యి రూపాయలు పెంచి, వచ్చే ఏడాదిలో మరో రూ.వెయ్యి పెంచేందుకు ఆర్థిక శాఖ అధికారులు లెక్కలు సేకరించినట్లు తెలుస్తోంది. అయితే ఇందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకే సారి ఫించన్లు పెంచడం, లేక రూ.వెయ్యి పెంచేందుకు అనుమతి ఇస్తారో తెలియాల్సి ఉంది.

నిరుపేద మహిళకు నెలకు రూ.2,500

మహిళా సాధికారత లక్ష్యంగా నిరుపేద మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించే పథకంపై ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా సేకరించిన సమాచారం మేరకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. రేషన్ కార్డు ప్రాతిపదికన కుటుంబంలోని ఒక మహిళకు ఈ నగదు బదిలీ జరగనుంది. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు అమలవుతుండగా, ఈ నగదు సాయం కూడా తోడైతే మహిళలకు మరింత ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్ లు

డిజిటల్ విద్యను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు అందించే కొత్త స్కీమ్‌ను ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టనుంది. ముఖ్యంగా ఉన్నత విద్య అభ్యసించే పేద విద్యార్థులకు, మెరిట్ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ పథకం ద్వారా విద్యార్థులకు గ్లోబల్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందని విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

తెలంగాణను శక్తివంతంగా తీర్చిదిద్దాలి

మొదటిపేజీ తరువాయి

చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో అడోబ్ సంస్థ సీఈఓ, 'తెలంగాణ రైజింగ్2047 విజన్' బోర్డు సభ్యుడు శాంతను నారాయణ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, భవిష్యత్తు ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితులు, అవకాశాలపై ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన చర్యల గురించి ముఖ్యమంత్రితో చర్చించారు. ఏఐతో ఉద్యోగ అవకాశాలపై పడే ప్రభావం, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాల్సిన ఆవశ్యకతపై ప్రధానంగా అభిప్రాయాలు పంచుకున్నారు.

ఏఐలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆర్థిక వ్యవస్థపై చూపించే ప్రభావం, రాబోయే రోజుల్లో ఏఐను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి తీసుకోవలసిన చర్యలపై శంతను నారాయణ్తో ముఖ్యమంత్రి చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆధునిక మార్పులను అందిపుచ్చుకుంటూ, అగ్రశ్రేణి ఐటీ, ఉత్పాదక సంస్థలను తెలంగాణకు ఆకర్షించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఈ భేటీలో ప్రస్తావించారు. సాంకేతిక రంగంతో పాటు తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు మరింత సహకరించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు.

తహసీల్దార్, ఆర్డీవో ఆఫీసులకు శాశ్వత భవనాలు

మొదటిపేజీ తరువాయి



చాలా వరకు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. అలాగే ప్రజలకు దూరంగా కలెక్టరేట్లను నిర్మించి నిర్వహణను గాలికివదిలేశారని విమర్శించారు.

స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో..

స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో అత్యాధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్‌మల్కాజిగిరి, పఠాన్‌చెరువులలో భవనాలకు శంకుస్థాపన పూర్తయ్యిందని, గచ్చిబౌలిలో నిర్మాణ పనులు తుది దశలో ఉండి మరికొద్ది నెలల్లో ప్రారంభానికి సిద్ధమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునీకీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

పసిబిడ్డ హత్య కేసులో నిందితులందరిను అరెస్టు చేయాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



ప్రతిపక్షం, నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 25: మల్లన్న జాతరలో దళిత బహుజనలపై దాడి చేసి రెండు నెలల పసిబిడ్డను హత్య చేసిన సంఘటనలో నిందితులందరినీ ఎస్సీ ఎస్టీ అత్యాచారల నిరోధక చట్టం చట్టం కేసులో అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. కుమ్మెర బాలిక హత్య సంఘటనపై డీబిఎఫ్ నిజానిర్ధారణ బృందం బుధవారం నాడు నాగర్ కర్నూల్ లో పర్యటించి బాధితులను కలిసి సంఘటన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో జరుగుతున్న ధర్నా శిబిరంలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ కుమ్మెర లో కులాంతర వివాహము చేసుకున్న మౌనిక, గణేష్ దంపతుల రెండు నెలల కూతురు ను అగ్రవర్ణాలు హత్య చేయడం సిగ్గుచేటు అన్నారు. 70 ఏళ్ల స్వాతంత్ర భారతంలో దళిత బహుజనులపై హత్యలు, అత్యాచారాలు సాధారణంగా మారిపోయారు. దళిత బహుజనులపై దారుణాలు నిత్య కృత్యంగా మారాయనీ అన్నారు. పాప హత్య కేసులో నిందితులందరినీ తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నిందితులపై హత్య కేసు నమోదు చేయాలని కోరారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి విచారణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి నిందితులకు జీవిత ఖైదు పడేవిధంగా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి చట్ట ప్రకారం నిత్యావసర సరుకులను అందజేయాలని కోరారు. అదే విధంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో డబల్ బెడ్ రూమ్ కేటాయించాలని కోరారు. భూమి ఉద్యోగము పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, నాయకురాలు శారద జయంతి నాయకులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మెర ఘటన అమానుషం

మొదటిపేజీ తరువాయి

మాట్లాడే సందర్భం కాదని, కానీ, నెలల పసిపాపై చనిపోయినా న్యాయం చేయకుండా అమానుషంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దాడిలో మరణించిన రెండు నెలల పసిపాప కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోలీసులకు జీతాలు ఇచ్చేది రాష్ట్ర ప్రజలని, రేవంత్ రెడ్డి కాదని అన్నారు. కుమ్మెర మల్లన్న స్వామి జాతరలో దాడి జరిగిన తర్వాత వారు ఫిర్యాదు చేస్తే అది సరిగ్గా లేదని పోలీసులు కంప్లైంట్ తీసుకోలేదని, ఫిర్యాదు తీసుకోకుండా అధికార పార్టీ నాయకులకు సమాచమిచ్చి, మీరు కౌంటర్ కంప్లైంట్ చేయండని చెప్పారని అన్నారు. పోలీసులు అధికార పార్టీ నేతలను కాపాడడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిడ్డకు పాలు ఇవ్వాల్సిన తల్లి ఖననం చేసి కన్నీళ్లు పెట్టుకుంటూ న్యాయం కోసం రోడ్డు మీద కూర్చుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ అధికార యంత్రాంగం ఈరోజు ఆ బిడ్డతో పాటు రాజ్యాంగాన్ని కూడా ఖననం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి పార్టీ తరపున లక్ష రూపాయాల ఆర్థిక సాయం అందజేశారు.

ఈ అమానవీయ ఘటనపై అసెంబ్లీలో సైతం గళం వినిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడి పసిపాపను కోల్పోయిన కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు ,శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి, అలా వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కుమ్మెర బాధితులకు సంఘీభావంగా దీక్షలో కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవు వేసి నివాళి అర్పించారు.

మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పదవీకాలం పొడిగింపు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 25: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా సీనియర్ పాత్రికేయులు కె. శ్రీనివాస్ రెడ్డి పదవీకాలాన్ని ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జర్నలిస్టుల సంక్షేమ చర్యలను కొనసాగించే ఉద్దేశంతో ఆయన నియామకాన్ని పొడిగించారు. 25 నుండి మరో 2 సంవత్సరాలు కె. శ్రీనివాస్ రెడ్డి మీడియా అకాడమీ చైర్మన్‌గా కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య పథకాల వంటి కీలక అంశాలపై శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో అకాడమీ చురుగ్గా పనిచేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, 2024, ఫిబ్రవరి 26న రెండేళ్ల కాలానికి గాను తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కె. శ్రీనివాస్ రెడ్డి నియమితులైన విషయం తెలిసిందే.





అక్రెడిటేషన్ కార్డుల కోసం డెస్క్ జర్నలిస్టుల ర్యాలీ

- గన్ పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులు
- 252 జీవోను రద్దుచేసి, జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలని డిమాండ్

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 25: అర్హులైన డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన 252 జీవోను రద్దుచేసి గతంలో ఇచ్చిన మాదిరిగానే జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం డెస్క్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో టీడబ్ల్యూజేఎఫ్, టీయూడబ్ల్యూజే(143), కేబుల్ నెట్వర్క్, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా సంఘాల ప్రతినిధులు హైదరాబాద్ లోని గన్ పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి, డెస్క్ జర్నలిస్టులందరికీ న్యాయం జరగాలంటూ స్లొగన్స్ చేశారు. అనంతరం తెలంగాణ మీడియా అకాడమీ వరకు ర్యాలీ నిర్వహించారు. అకాడమీ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. మీడియా అకాడమీ సెక్రటరీకి వినతి పత్రం అందజేసి తమ డిమాండ్లు తెలియజేశారు. ఈ సందర్భంగా డెస్క్ జర్నలిస్టుల సంఘం ప్రెసిడెంట్ బాదిని ఉపేందర్ మాట్లాడుతూ.. సవరణ జీవో 252 ప్రకారం అక్రిడేషన్లు జారీ చేస్తే డెస్క్ జర్నలిస్టులు అన్యాయానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడేషన్లు తగ్గించడం అంటే జర్నలిస్టులకు సంక్షేమాన్ని దూరం చేయడమే అవుతుందని అన్నారు. జర్నలిస్టులకు ఇస్తున్న హెల్త్ కార్డులు అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఎడిషన్ సెంటర్లో నాలుగైదు జిల్లాల డెస్కులు ఉన్నాయని, వారందరికీ జిల్లాకు నాలుగు చొప్పున ఎడిషన్ సెంటర్ల పరిధిలోని అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ ప్రెసిడెంట్ మామిడి సోమయ్య మాట్లాడుతూ.. అక్రెడిటేషన్ల సంఖ్యకు పత్రికల సర్కులేషన్ కు లింకు పెట్టడం సరికాదని అన్నారు. పత్రికల సర్క్యులేషన్ ఎంత ఉన్నప్పటికీ.. పని చేసే జర్నలిస్టుల సంఖ్య తగ్గట్లేదు కాబట్టి.. సర్క్యులేషన్ నిబంధనను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న పత్రికల్లో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన ర్యాలీలో ఎస్ వెంకటేష్, టి శ్రీనివాస్, రవి, డీజే ఎస్ నేతలు సత్య ప్రసాద్, రమేష్, వెంకటరమణ జర్నలిస్టులు పద్మ, సైదిరెడ్డి, వెంకటేష్, ఆర్.రమేష్, కృష్ణారావు, జనార్ధన్, సదానందం, రాజు, యాదగిరి రెడ్డి, రవీందర్, నరేష్, రాజశేఖర్ గౌడ్, వెంకటేశ్వరరావు, ఉదయ్ కుమార్, విజయ్ తో పాటు కేబుల్ , డిజిటల్ మీడియా ప్రతినిధులు, పలు సంఘాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఉపేక్షించరాదు

మొదటిపేజీ తరువాయి



సుదీర్ఘ కాలం నుంచి ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటోందని, ఈ మహమ్మారిని అణిచివేసేందుకు భారత్ చేస్తున్న కృషికి ఇజ్రాయెల్ ఎప్పుడూ అండగా ఉందన్నారు. భారత్ కూడా ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోదన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంతమొందించి తీరాల్సిందేనని ప్రధాని మోదీ అన్నారు.

'పౌరుల హత్యను ఏ కారణమూ సమర్థించలేదు. ఉగ్రవాదాన్ని ఏదీ కూడా సమర్థించలేదు. భారతదేశం కూడా సుదీర్ఘ కాలంగా ఉగ్రవాద బాధను అనుభవించింది. 26/11 ముంబయి దాడులను, అందులో ప్రాణాలు కోల్పోయిన ఇజ్రాయెల్ పౌరులతోసహా అమాయకులను మేం గుర్తు చేసుకుంటాము. మీలాగే, మేము కూడా ఎటువంటి ద్వంద్వ ప్రమాణాలు లేకుండా, ఉగ్రవాదం పట్ల జీరో టాలరెన్స్ అనే స్థిరమైన, రాజీలేని విధానంతో ఉన్నాము' అని ప్రధాని అన్నారు. 'సమాజాలను అస్థిరపరచడం, అభివృద్ధిని అడ్డుకోవడం, నమ్మకాన్ని దెబ్బతీయడమే ఉగ్రవాదం లక్ష్యం. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి నిరంతరం సమన్వయంతో కూడిన ప్రపంచ స్థాయి చర్య అవసరం. ఎందుకంటే ఎక్కడ ఉగ్రవాదం ఉన్నా అది ప్రతిచోటా శాంతికి విఘాతం కలిగిస్తుంది. అందుకే శాశ్వత శాంతికి, ప్రాంతీయ స్థిరత్వానికి దోహదపడే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుంది' అని మోదీ పేర్కొన్నారు. కాగా, ఇజ్రాయెల్ పార్లమెంట్ ప్రధాని నరేంద్ర మోదీకి 'స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ పతకాన్ని' ప్రదానం చేసింది.

వాణిజ్య ఒప్పందాలు రెట్టింపు: నేతన్యాహు

అంతకుముందు పార్లమెంటులో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడారు. భారత్‌తో ఇజ్రాయెల్ మధ్య వాణిజ్య ఒప్పందాలు రెట్టింపు అయ్యాయని ఆయన వెల్లడించారు. భారత్‌తో సన్నిహిత సంబంధాలు సైతం మూడు రెట్లు పెరిగాయని తెలిపారు. మోదీ ఇజ్రాయెల్ పర్యటన ఎంతో సంతోషదాయకం అని అన్నారు. మోదీ స్నేహితుడి కంటే ఎక్కువ తన సోదరుడు అని పేర్కొన్నారు. చాలా విషయాల్లో తామిద్దరు సోదరులమని అన్నారు. అలాగే గతేడాది మోదీ ఇజ్రాయెల్ పర్యటనను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. భారత్, ఇజ్రాయెల్ మధ్య అనుబంధాన్ని మాటల్లో వర్ణించలేమన్న నెతన్యాహు ఇరు దేశాల ప్రజల మధ్య సుహృద్భావ సంబంధాలు ఉన్నాయని వివరించారు. 'మనవి రెండు ప్రాచీన నాగరికతలు. కాలక్రమంలో ఎన్నో కష్టనష్టాలను, సవాళ్లను ఎదుర్కొంటూ సుదీర్ఘ ప్రయాణం చేశాం. ఐనప్పటికీ ఎనభై ఏళ్ల క్రితం, మనం ఒకే సమయంలో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం సాధించాం. మనకు ఎన్నో ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. మనవి రెండు ప్రజాస్వామ్య దేశాలు. మీరు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం. ఇజ్రాయెల్ కూడా అటువంటిదే. మరే ఇతర దేశం ఎదుర్కోని సవాళ్లు మధ్య మన ప్రజాస్వామ్యాన్ని ఎలా కాపాడుకుంటున్నామో ఒక్కసారి ఆలోచించండి. ఇప్పుడు మనం మన మధ్య ఉన్న ఈ లోతైన బంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటున్నాం' అని నెతన్యాహు అన్నారు.



ఏఐ వల్ల కంపెనీ ఆదాయం తగ్గినా పర్లేదు . ఈ కొత్త టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయనే భయం మాకు లేదు. పైగా మా 6 లక్షల మంది ఉద్యోగులు ఇందులో నైపుణ్యం సాధించాలి. సీనియర్ల కంటే జూనియర్లే దీన్ని వేగంగా ఒంటబట్టించుకుంటున్నారు. ఏఐని కేవలం వాడుకోవడం కాకుండా కొత్త సొల్యూషన్స్ బిల్డ్ చేయాలి.

- టీసీఎస్ ఉద్యోగులతో సీఈవో కృతివాసన్

రాజకీయం

పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలి

- కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు
- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 25: తెలంగాణకు ఆర్థిక మూలాలు పెంచేలా పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. 2026-27 ఏడాదికిగాను పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి బడ్జెట్ ప్రతిపాదనలపై సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు తీసుకురాగలమని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని వివరించారు. బడ్జెట్‌లో నిధులు ఎన్ని కేటాయించారనేది కాకుండా ఎంతమేరకు ఖర్చు చేశామనే ఆలోచన చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయాలని అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో పథకాలను డిజైన్ చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి రాష్ట్రంలో జరుగాలని మంత్రి శ్రీహరి అన్నారు.

పాడి రంగానికి సంబంధించి అన్ని అంశాలు బడ్జెట్‌లో పొందుపరచాలని, పాల ఉత్పత్తి, అందుకావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి శ్రీహరి అన్నారు. పాడి పరిశ్రమ బలోపేతం, సమన్వయం కోసం ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించుకోవాలని, దానివల్ల పాల ఉత్పత్తిని పెంచుకోవొచ్చని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. వెటర్నరీ సంస్థల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలకు కూడా బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గతంలో లాగా కాకుండా పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయాలని మంత్రి అధికారులకు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్ , డైరెక్టర్ గోపీ, డెయిరీ డెవలప్‌మెంట్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, పివి నర్సింహరావు వెటర్నరీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా.జ్ఞానప్రకాశ్, ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, అగ్ర నేత రాహుల్ గాంధీని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుటుంబ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 5న హైదరాబాద్ లో జరగనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వారిని ఆహ్వానించారు. -ప్రతిపక్షం, న్యూఢిల్లీ



బ్రెజిల్ దేశంలో లిథియం మైనింగ్

- భాగస్వామ్యానికి సింగరేణికి ఆహ్వానం
- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతిని కలిసిన సీబీఎల్ కంపెనీ ప్రతినిధులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26: లిథియం మైనింగ్ లో సింగరేణి సంస్థ భాగస్వామిగా చేరాలని కోరుతూ బ్రెజిల్ దేశానికి చెందిన ప్రముఖ సీబీఎల్ సంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతిని కలిసి వివరాలను తెలియజేసింది. సీబీఎల్ (కంపాన్హియా బ్రసిలీరా డి లిటియో) బోర్డు డైరెక్టర్ డేనియల్ లెమే, సీఈవో వినీసియస్ అల్వారెంగా తమ కంపెనీ వివరాలను తెలియజేశారు. బ్రెజిల్ దేశంలో ఇప్పటికే తాము లిథియం మైనింగ్ చేపట్టామని, సింగరేణి సంస్థ కీలక ఖనిజాల పట్ల ఆసక్తితో ఉన్న నేపథ్యంలో తమ కంపెనీలో భాగస్వామిగా చేరినట్లయితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వారు వివరించారు. తాము సింగరేణితో పాటు దేశంలోని ప్రముఖ కంపెనీలను కూడా సంప్రదిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేడు ప్రపంచంలో లిథియం కీలక ఖనిజానికి ఉన్న ప్రాధాన్యత, వ్యాపార కోణంలో ఉన్న లాభదాయకత గురించి వివరించారు. సింగరేణి సంస్థకు సంబంధించిన వివరాలను డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పర్సనల్, ఫైనాన్స్ గౌతమ్ పోట్రు వివరించారు. బ్రెజిల్ దేశంలో కీలక ఖనిజ అవకాశాలను, లాభదాయకత తదితర అంశాలపై తాము చర్చించి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి ఉన్నతాధికారులు పేర్కొన్నారు.



'అన్వేష్' పై లుక్‌అవుట్ నోటీసులు

- జారీ చేసిన పంజాగుట్ట పోలీసులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 25: ప్రపంచ యాత్రికుడిగా పేరు తెచ్చుకున్న యూట్యూబర్ అన్వేష్ (నా అన్వేషణ)కు మరో బిగ్‌షాక్ తగిలింది. పంజాగుట్ట పోలీసులు అతనిపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల అన్వేష్ అకౌంట్‌ను ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత అతడు తనకు ఇంకా రెండు ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, రెండు యూట్యూబ్ ఛానళ్లు ఉన్నాయని వీడియో విడుదల చేశారు. అసభ్యకరమైన పదజాలాన్ని వాడుతూ వీడియోను విడుదల చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పంజాగుట్ట పోలీసులు... అన్వేష్‌కు సంబంధించిన మరో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌తో పాటు యూట్యూబ్ ఛానళ్లను మూసివేయాలని సంబంధిత సంస్థలకు లేఖలు రాయనున్నారు. ఇప్పటికే హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అన్వేష్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే.



జర్నలిస్టుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత

- సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- మంత్రితో డిజిటల్ మీడియా జర్నలిస్టుల భేటీ
- అక్రెడిటేషన్ జీవోను సవరించాలని వినతి
- సానుకూలంగా స్పందించిన మంత్రి

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 26: జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవం పరిరక్షణ ప్రభుత్వ బాధ్యతని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మినిస్టర్ క్వార్టర్స్ లో ఇండిపెండెంట్ , డిజిటల్ మీడియా జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మంత్రితో సమావేశమయ్యారు. అక్రెడిటేషన్‌కు సంబంధించిన ప్రస్తుత ప్రభుత్వ ఉత్తర్వు (జీవో)లో మార్పులు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. డిజిటల్ మీడియా విస్తరణ నేపథ్యంలో అక్రెడిటేషన్ నిబంధనలను కాలానుగుణంగా సవరించాల్సిన అవసరం ఉందని వారు మంత్రికి వివరించారు. ప్రత్యేకించి ఇండిపెండెంట్ జర్నలిస్టులు, డిజిటల్ న్యూస్ ప్లాట్ ఫార్మ్‌లలో పనిచేస్తున్న జర్నలిస్టులకు సరైన గుర్తింపు కల్పించేలా మార్గదర్శకాలను రూపుదిద్దాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి.. జర్నలిస్టుల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోవాలని ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్ ప్రియాంకను ఆదేశించారు. ఈ సమావేశంలో తెలంగాణ డిజిటల్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ నాయకులు స్వామి ముద్దం, సిద్దగౌని సుదర్శన్, మేకల కృష్ణ, ఎక్కులూరి నాగార్జున్ రెడ్డి, ఈ.శ్రీనివాస్ రావు, ప్రభాకర్ సౌదాల, అమర్, ఓయూ శ్రీనివాస్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఈసీ మెంబర్ అశోక్ దయ్యాల తదితరులు పాల్గొన్నారు. అక్రెడిటేషన్ జీవో సవరణకు ప్రభుత్వం ముందడుగు వేస్తుందనే ఆశాభావాన్ని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు వ్యక్తం చేశారు.



గంజాయి పట్టివేత... ముగ్గురు రిమాండ్

- బీహార్ నుంచి గంజాయి తెచ్చి విక్రయం
- ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలరాజు

ప్రతిపక్షం, షాద్‌నగర్, ఫిబ్రవరి 26: షాద్ నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఫరూక్ నగర్ మండలం చింతగూడ గ్రామ పరిధిలోని శ్రీబాలాజీ పౌల్ట్రీ ఫామ్‌లో టేకెదార్‌గా పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఆత్మ మహతో తన స్వరాష్ట్రం నుంచి గంజాయి తెచ్చి, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి బూర్గుల, కాశిరెడ్డిగూడ, చింతగూడ, బాలానగర్, షాద్ నగర్ పరిసర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న కార్మికులను లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్నట్టు సమాచారం అందింది. పక్కా సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రంగారెడ్డి డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం 24న సాయంత్రం దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆత్మ మహతోను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 1.7 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుంది. ఈ అక్రమ వ్యాపారంలో సహకరిస్తున్న బీహార్‌కు చెందిన సుశీల్ కుమార్, ప్రేమ్ రామ్‌లను కూడా అధికారులు అరెస్టు చేశారు. అనంతరం ముగ్గురిని షాద్ నగర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించగా, కోర్టు ఆదేశాల మేరకు 25న రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎ. బాలరాజు, ఎస్సై కె. వెంకటేశ్వర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు



మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లను సన్మానించిన కాలనీ వాసులు

ప్రతిపక్షం, షాద్‌నగర్, ఫిబ్రవరి 26: మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, 7వ వార్డు కౌన్సిలర్ కొప్పునూరు ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్లు మురాలీ మోహన్ అప్పీ, పెంటయ్యలను తిరుమల మేఘా టౌన్ షిప్‌తో పాటు సూర్య కాలనీ, హైటెక్ కాలనీ, ఆనంద్ కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. బుధవారం తిరుమల మేఘా టౌన్ షిప్ వేదికగా జరిగిన సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. సూర్య కాలనీ, హైటెక్ కాలనీ, ఆనంద్ కాలనీకి చెందిన మహిళలు, పెద్దలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు, సామాజిక వేత్త గంగి రెడ్డి, తెలంగాణ విద్యావేత్తల వేదిక టీజీ వెంకటేష్ తదితరులు హాజరై నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమం ఉత్సాహంగా, స్నేహపూర్వక వాతావరణంలో ముగిసింది.



అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి

- 18వ వార్డు కౌన్సిలర్ చేగూరి అరుణ రామకృష్ణగౌడ్.

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 25 : 18వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వార్డు కౌన్సిలర్ చేగూరి అరుణ రామకృష్ణగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వార్డు అభివృద్ధికి నాతో కలిసి పని చేస్తున్న మున్సిపల్ సిబ్బంది , అభివృద్ధి పనులకు సహకరిస్తున్న కాలనీ వాసులకు ప్రత్యేకంగా ధన్యవాదలు తెలిపారు.ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు . డ్రైనేజీ సమస్య తీరుతుండటంతో బస్తీ వాసులు సంతోషం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రంలో పెద్దమంగళారం మాజీ సర్పంచ్ చేగూరి రామక్రిష్ణ గౌడ్, మాజీ వార్డు సభ్యులు ధనరాజ్ గౌడ్, శ్రావణ్ గౌడ్, విరస్వామి, శ్రీకాంత్, ప్రశాంత్, సాయి, విజయ్ లు పాల్గొన్నారు.

పసిపాప హంతకులను కఠినంగా శిక్షించాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- జిల్లా ఎస్పీ, కలెక్టర్లను ఆదేశం



ప్రతిపక్షం, నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 25: నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మర మల్లన్న జాతరలో పసిపాపను హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా ఎస్పీని ,కలెక్టర్‌ను ఆదేశించారు. బుధవారం నాడు కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన సంఘటన పసిపాప హత్యపై నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహించారు. విచారణలో పాల్గొన్న బాధితులు మౌనిక ,గణేష్ ,చంద్రకళ, కీర్తిలు తమ గోడును ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కు విన్నవించారు. జాతరకు వెళ్లిన తమను డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసి జాతరలో పాల్గొనకుండా అవమానపరిచారని వివరించారు. తమకు జరిగిన అవమాన సంఘటనపై నిలదీసిన పాపానికి గ్రామ పెత్తందారు లు శ్రీనివాస్ రెడ్డి తదితరులు చాకలి గణేష్‌ను వి చక్షరహితంగా హింసించారు. ఇది అడ్డుకున్న గణేష్ భార్య దళితురాలైన మౌనిక ను సైతం హింసించారు. తమను కొట్టవద్దని తమ బిడ్డ ముఖమైన చూసి వదిలివేయాలని ప్రాదేయపడిన పెత్తందారులకు మనసు కరగక తన్నడంతో పసిపాప మరణించిందని వివరించారు. ఇందుకు స్పందించిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ రెండు నెలల పసిపాప హత్య సభ్య సమాజం తరలించుకునే విధంగా ఉందన్నారు. పోలీసులు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కుటుంబానికి రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీని ఆదేశించారు. అదేవిధంగా కుటుంబానికి ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని ఆదేశించారు. తక్షణమే లక్ష రూపాయల చెక్కును బాధిత కుటుంబానికి చైర్మన్ అందజేశారు. గత కొంతకాలంగా తెలంగాణలో ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మిగత నిందితులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కేసు త్వరగా విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ను ఏర్పాటు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి జిల్లా కేంద్రంలో డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని కలెక్టర్ ను ఆదేశించగా ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు .ఉద్యోగము పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ ను చైర్మన్ ఆదేశించారు .ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పీ .శంకర్ ,రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన , శారద వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పెద్దమంగళారంలో తాగునీటి సమస్యకు చెక్

- నూతన బోరు మోటర్ ఏర్పాటు

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 25 : మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం 26వ వార్డులో తాగునీటి కొరతను దృష్టిలో ఉంచుకుని వార్డు కౌన్సిలర్ పడమటి మమత నూతన బోరు మోటర్ ఏర్పాటు చేయించారు. గత కొంతకాలంగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు ఈ చర్యతో గణనీయమైన ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ... ప్రజల ప్రాథమిక అవసరాల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వార్డు అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



యూఎస్‌తో ట్రేడ్ డీల్ క్యాన్సిల్ చేసుకోమని నేను సవాల్ విసిరి 24 గంటలకుపైనే అయింది. దీనిపై స్పందించకుండా సైలెంట్‌గా మోదీ ఇజ్రాయెల్ వెళ్లిపోయారు. గతంలో ఓసారి ఎప్‌స్టీన్ ఆదేశాలతో ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఇప్పుడు ఎవరి ఆదేశాలతో మళ్లీ వెళ్లారు.

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

ఓపెన్ వాయిస్


ఆసక్తికరంగా తమిళ రాజకీయాలు

తమిళనాడు రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది.తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటోంది. 'తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టిన సినీ నటుడు దళపతి విజయ్ . అధికార డీఎంకే సీఎం ఎంకె స్టాలిన్ లక్ష్యంగా విమర్శల దాడిని తీవ్రం చేశారు. వేలూర్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన.. అధికార పక్షంపై సంచలన ఆరోపణలు చేశారు. రాబోయేది కేవలం ఎన్నికలు కాదని, అవినీతి ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు మధ్య జరగబోయే మహా యుద్ధమని, ఇందులో అంతిమ విజయం ప్రజలదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి, అందరూ చిన్నమ్మ అని పిలుచుకునే శశికళ తన కొత్త రాజకీయ ప్రస్థానాన్ని అధికారికంగా ప్రారంభించారు. జయలలిత జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆమె తన కొత్త రాజకీయ పార్టీ జెండాను ఆవిష్కరించారు. శశికళ ఆవిష్కరించిన పార్టీ జెండాను నలుపు, తెలుపు, ఎరుపు రంగులతో ఉంది. అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశం ఏంటంటే.. ఈ జెండా మధ్యలో ద్రవిడ రాజకీయ దిగ్గజాలు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత ముఖచిత్రాలను పొందుపరిచారు. తద్వారా తానే జయలలిత అసలైన రాజకీయ వారసురాలినని ఆమె పరోక్షంగా కేడర్‌కు సంకేతాలు పంపారు.సభలో ప్రసంగిస్తూ శశికళ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. జయలలిత మరణం తర్వాత తనపై జరిగిన దుష్ప్రచారాన్ని గుర్తు చేసుకుని ఆమె కన్నీరు పెట్టుకున్నారు. జయలలిత నేనే హత్య చేశానని ప్రచారం చేసి నా మనసును గాయపరిచారు. జయలలిత మరణించిన సమయంలో నేను తీవ్రమైన దుఃఖంలో ఉన్నాను. అందుకే అప్పుడు చాలా మంది బతిమలాడినా నేను పార్టీ అధ్యక్ష పదవిని గానీ, సీఎం పదవిని గానీ తీసుకోలేదు అని శశికళ ఆవేదన వ్యక్తం చేశారుప్రస్తుత అన్నాడీఎంకే అగ్రనాయకత్వంపై ఆమె నిప్పులు చెరిగారు. పన్నీర్ సెల్వం అప్పట్లో ఆయన తనను తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. పళనిస్వామిని సీఎంను చేయడం తాను చేసిన అతి పెద్ద పొరపాటు అని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన తర్వాత తనను ఒక చిత్తుకాగితంలా చూశారని, చివరకు హీనంగా పార్టీ నుంచి బహిష్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు.జయలలిత చనిపోయిన తర్వాత తమిళనాట అనేక చిత్ర విచిత్రాలు జరిగాయని, ఇకపై తాను మౌనంగా ఉండబోనని శశికళ స్పష్టం చేశారు. "తమిళ రాజకీయాల్లో ఇక నా మార్క్ చూపిస్తాను.. ప్రజల కోసం యాక్టివ్‌గా పని చేస్తాను" అని ఆమె ప్రకటించారు. పార్టీ పేరు, విధివిధానాలపై త్వరలోనే స్పష్టమైన ప్రకటన చేస్తానని ఆమె తెలిపారు.ప్రభుత్వ అవినీతిని, అక్రమాలను తాను నిర్భయంగా ప్రశ్నిస్తున్నందుకే అధికార పార్టీ తనను ప్రధాన లక్ష్యంగా చేసుకుందని విజయ్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలవకుండా అడ్డుకునేందు కు టీవీకే పార్టీ సభలకు సైతం ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అనుమతులు నిరాకరిస్తోందని మండిపడ్డారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, కుట్రలు పన్నినా తాను వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. "ఇప్పుడు నన్ను ప్రజల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవచ్చు.. కానీ ఎన్నికల్లో గెలిచి మా పార్టీ అధికారంలోకి వచ్చాక నేనే స్వయంగా ప్రతి గ్రామాన్ని సందర్శిస్తాను" అని విజయ్ సభాముఖంగా హామీ ఇచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, నేరాలను అరికట్టడంలో స్టాలిన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విజయ్ ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎలాగైనా ఓడించాలనే లక్ష్యంతోనే సీఎం స్టాలిన్ కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. పరిస్థితులకు అనుగుణంగా అవకాశవాద రాజకీయాలు చేయడం డీఎంకేకు వెన్నతో పెట్టిన విద్య అని, రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో వారు బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ఓటు వేయడమంటే.. పరోక్షంగా బీజేపీకి ఓటు వేసినట్లేనని ఆయన కుండబద్దలు కొట్టారు.తాము అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత సురక్షితమైన ప్రాంతంగా మారుస్తానని విజయ ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యంగా విద్య, భద్రతపై కీలక హామీలు ఇచ్చారు. నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులు పోటీ పరీక్షల శిక్షణ కోసం లక్షల రూపాయలు ప్రైవేట్ సంస్థలకు పోయాల్సిన అవసరం లేకుండా .. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే ఉచితంగా నాణ్యమైన శిక్షణను అందిస్తామన్నారు. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సైతం బాలికల కోసం పరిశుభ్రమైన, సురక్షితమైన మరుగుదొడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నేర రహిత సమాజం కోసం, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
26.02.2026

విద్యారంగంపై ప్రైవేటీకరణ ప్రభావం

ఒక దేశం యొక్క నిజమైన సంపద దాని విద్యార్థులే. విద్య సమాన అవకాశాలను కల్పించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రైవేట్ భాగస్వామ్యం, ప్రభుత్వ బాధ్యత, సమాజ సహకారం. ఈ మూడు కలిసి పనిచేసినప్పుడే విద్యా వ్యవస్థ సమగ్రంగా ఎదుగుతుంది. విద్యను వ్యాపార దృష్టితో కాకుండా సామాజిక బాధ్యతగా భావిద్దాం. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా కృషి చేద్దాం. "విద్య సమానత్వానికి పునాది – అందరికీ అవకాశమే నిజమైన అభివృద్ధి.



కనపర్తి సుధాకర్
9441313780

'దేశ అభివృద్ధి ప్రజల చైతన్యంపై ఆధారపడి ఉంటుంది; ఆ చైతన్యానికి మూలం విద్య" అని మహాత్మా గాంధీ తరచూ ప్రస్తావించారు. విద్య కేవలం వ్యక్తిగత విజయానికి మార్గం మాత్రమే కాదు; అది సమాజ మార్పుకు శక్తి. ఒక దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుంది. అందుకే విద్యను హక్కుగా, బాధ్యతగా, సామాజిక మార్పు సాధనంగా భావించాలి. ఇటీవలి దశాబ్దాల్లో భారతదేశంలో విద్యారంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. చిన్నపాటి పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు ప్రైవేట్ సంస్థలు విస్తరించాయి. ఈ మార్పు ఒకవైపు విద్యా విస్తరణకు దోహదపడితే, మరోవైపు సమాన అవకాశాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ముఖ్యంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఉన్నత విద్య అందుబాటులో ఉండాలంటే ఎలాంటి సమతుల్యత అవసరమో అనే అంశం చర్చనీయాంశంగా మారింది.

సేవా దృక్పథం నుండి పోటీ వాతావరణం వరకు ఒకప్పుడు విద్యాసంస్థలు సేవా దృక్పథంతో నడిచేవి. ప్రభుత్వ పాఠశాలలు, సహకార విద్యా సంస్థలు, మిషనరీ విద్యాసంస్థలు సమాజానికి సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేశాయి. విద్య ద్వారా సామాజిక చైతన్యం పెంపొందించడం ప్రధాన ఆశయం. ప్రస్తుతం పరిస్థితి మారింది. గ్లోబలైజేషన్ ప్రభావం, మార్కెట్ ఆర్థిక విధానాలు, సాంకేతిక విప్లవం... ఈ మార్పులు విద్యను పోటీ రంగంగా మార్చాయి. ప్రైవేట్ పాఠశాలలు ఆధునిక భవనాలు, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ బోధన, ప్రత్యేక కోచింగ్ విధానాలతో ముందుకు వస్తున్నాయి. ఇది నాణ్యతపై దృష్టిని పెంచినప్పటికీ, ఫీజుల భారంతో సామాన్య కుటుంబాలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విద్యా రంగంలో పోటీ మంచిదే; కానీ అది సమాన అవకాశాలను పరిమితం చేయకూడదు. విద్య ఒక వస్తువుగా మారితే, అది సామాజిక అసమానతలకు దారి తీసే ప్రమాదం ఉంది. పాఠశాల స్థాయిలో అసమానతల సంకేతాలు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మధ్య విద్యా సదుపాయాల్లో తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పట్టణాల్లో ప్రైవేట్ పాఠశాలలు ఆధునిక వసతులతో ఆకర్షణీయంగా ఉంటే, కొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాలలు మౌలిక సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నాయి. అయితే ప్రభుత్వ పాఠశాలలు ఇప్పటికీ లక్షలాది విద్యార్థులకు ఆశ్రయం. మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు వంటి కార్యక్రమాలు విద్యను అందుబాటులో ఉంచుతున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే సమాన విద్యా వ్యవస్థ సాధ్యమవుతుంది. ఉపాధ్యాయ నియామకాలు పారదర్శకంగా జరగాలి. శిక్షణా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి. డిజిటల్ వసతులు గ్రామీణ పాఠశాలలకు చేరాలి.

ఉన్నత విద్య – విస్తరణలో విలువల సమతుల్యత

ఉన్నత విద్యారంగంలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, స్వయం ప్రతిపత్తి కళాశాలలు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు విస్తరించాయి. ఐటీ, మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సులు యువతను ఆకర్షిస్తున్నాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు రూపుదిద్దుకుంటున్నాయి. ఇది సానుకూల పరిణామమే. అయితే ఫీజుల అధికత మధ్యతరగతి విద్యార్థులకు భారంగా మారుతోంది. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిమితులు కారణంగా ఉన్నత విద్యను వదులుకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. "విద్య సమానత్వానికి ఆయుధం" అని బి.ఆర్. అంబేద్కర్ పేర్కొన్నారు. ఉన్నత విద్య కొద్దిమందికే పరిమితం కాకుండా ప్రతిభ ఆధారంగా అందరికీ అందుబాటులో ఉండాలి. సామాజిక న్యాయం, అవకాశ సమానత్వం విద్య ద్వారా సాధ్యమవుతుంది.



నైపుణ్యాభివృద్ధి వైపు విద్యా ప్రస్థానం

ప్రస్తుతం విద్యా విధానం ఉద్యోగావకాశాల దృష్టితో మార్పు చెందుతోంది. నైపుణ్యాల అభివృద్ధి, స్టార్టప్ సంస్కృతి, పరిశ్రమలతో అనుసంధానం, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు ప్రాముఖ్యం పొందుతున్నాయి. అయితే విద్య కేవలం ఉపాధి సాధనంగా మాత్రమే మారకూడదు. మానవ విలువలు, నైతికత, సామాజిక బాధ్యత, సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం కూడా సమాన ప్రాధాన్యం పొందాలి. విద్యార్థి కేవలం ఉద్యోగి కాకుండా సమాజానికి బాధ్యతగల పౌరుడిగా ఎదగాలి.

సమాన అవకాశాల అవసరం

విద్య ఖరీదైనదిగా మారితే అది సామాజిక విభజనకు దారి తీస్తుంది. ఫీజుల భారం వల్ల కొందరు విద్యార్థులు చదువును మధ్యలోనే మానేయాల్సి వస్తోంది. విద్యార్థి రుణాల భారం కుటుంబాలపై ఒత్తిడిని పెంచుతోంది. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు, మెరిట్ మరియు అవసరాధారిత సహాయాలు సమర్థంగా అమలవ్వాలి. గ్రామీణ మరియు పేద కుటుంబాల పిల్లలకు ప్రత్యేక మద్దతు అవసరం. డిజిటల్ విద్యా వనరులు అందరికీ చేరాలి.

గ్లోబల్ అనుభవాలు – సమగ్ర భాగస్వామ్యం

అభివృద్ధి చెందిన దేశాలు ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల మధ్య సమతుల్య భాగస్వామ్యాన్ని అమలు చేస్తున్నాయి. నాణ్యతను కాపాడుతూ, ఫీజుల నియంత్రణ, స్కాలర్‌షిప్ విధానాలు, విద్యార్థి మద్దతు వ్యవస్థలు బలోపేతం చేయబడ్డాయి. "Education is the most powerful weapon which you can use to change the world" అని Nelson Mandela పేర్కొన్నారు. ఆ శక్తి కొద్దిమందికి మాత్రమే కాకుండా ప్రతి వర్గానికి చేరినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

ముందున్న మార్గం – సమగ్ర దృష్టి అవసరం

విద్యారంగం సమతుల్యంగా అభివృద్ధి చెందాలంటే... ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి నిరంతర కృషి ఫీజుల పారదర్శక నియంత్రణ ఉపాధ్యాయుల శిక్షణ మరియు నియామకాల మెరుగుదల నైపుణ్యాభివృద్ధితో పాటు విలువల విద్య పరిశోధన మరియు ఆవిష్కరణలకు ప్రోత్సాహంపేద మరియు గ్రామీణ విద్యార్థులకు లక్షిత సహాయం ఇవి విమర్శలకు కాదు; భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం అవసరమైన మార్గదర్శకాలు. విద్యను సమానత్వానికి పునాదిగా భావిద్దాం. ఒక దేశం యొక్క నిజమైన సంపద దాని విద్యార్థులే. విద్య సమాన అవకాశాలను కల్పించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రైవేట్ భాగస్వామ్యం, ప్రభుత్వ బాధ్యత, సమాజ సహకారం. ఈ మూడు కలిసి పనిచేసినప్పుడే విద్యా వ్యవస్థ సమగ్రంగా ఎదుగుతుంది. విద్యను వ్యాపార దృష్టితో కాకుండా సామాజిక బాధ్యతగా భావిద్దాం. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా కృషి చేద్దాం. "విద్య సమానత్వానికి పునాది - అందరికీ అవకాశమే నిజమైన అభివృద్ధి."

(వ్యాస రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్ఆర్ఆర్

దేవుడు ఒక్కడే... దారులు వేరు!

మనిషిలో మానవత్వం చచ్చినప్పుడు, రాతి విగ్రహాల వెనుక దైవం ఎందుకు ఉంటుంది? చివరిగా ఒక సత్యం ఏ దేవుడూ తన పేరిట హింసను ఆదేశించలేదు. ఏ పవిత్ర గ్రంథమూ ద్వేషించు చంపు అని బోధించలేదు. ఆ నెత్తుటి అక్షరాలు మనుషులు రాసుకున్నవి, స్వార్థపరులు తమకు అనుకూలంగా మార్చుకున్నవి మాత్రమే! ఆకాశం ఒకటే అయినా మనకు వేర్వేరు దిక్కుల్లో కనిపిస్తుంది, సముద్రం ఒకటే అయినా వేర్వేరు తీరాలను తాకుతుంది. దైవం కూడా అంతే! ఈ నిజాన్ని మనం మనస్ఫూర్తిగా నమ్మిన నాడు, మతాల మధ్య మనిషి కట్టుకున్న గోడలు పేకమేడల్లా కూలిపోతాయి.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169



ఆదిమానవుడు అడుగువేసిన నాటి నుండి నేటి వరకు కాలం మారుతున్నా మారని ఒకే ఒక్క ప్రశ్న దేవుడు ఎలా ఉంటాడు? ఈ అన్వేషణలో మనిషి వేల ఏళ్లుగా అలిసిపోతూనే ఉన్నాడు. శిలల్లో వెతికాడు, శిల్పాలు చెక్కాడు, మసీదులు, చర్చిలు నిర్మించి ఆకాశం వైపు చూశాడు. కానీ, ఆ సృష్టికర్త మాత్రం ఏనాడూ ఎదురుపడి నేను ఇలా ఉంటాను అని తన చిరునామా చెప్పలేదు. ఫలితంగా, మనిషే తన ఊహకు మతం రంగులద్ది, తను నమ్మిన దైవమే గొప్పదంటూ వాదించుకుం టున్నాడు. తాత్విక కోణంలో దర్శిస్తే, దైవం ఒక అనంతమైన భావం. హిందూ ధర్మం దేవుణ్ణి సచ్చిదానంద స్వరూపుడు గా అంటే సత్యం, చైతన్యం, పరమానందాల సమ్మేళనంగా అభివర్ణించింది. అదే సమయంలో, ఇస్లాం ఆ పరమాత్మను నిరాకారుడిగా, సర్వశక్తిమంతుడైన అల్లాగా కొలుస్తుంది. ఇక క్రైస్తవం దైవత్వాన్ని ప్రేమలో వెతికింది, దేవుడే ప్రేమామయుడు అని చాటిచెప్పింది. ఇలా బౌద్ధ, జైన, సిక్కు మతాలు సైతం ఆ వెలుగును వెతకడంలో తమదైన ప్రత్యేక ముద్రను వేయడం విశేషం. కానీ, ఒక్క క్షణం ఆలోచిద్దాం ఏ మతమైనా దైవాన్ని ప్రేమకు, కరుణకు, న్యాయానికి మారుపేరుగానే కదా వర్ణించింది? నా దేవుడు ద్వేషాన్ని కోరుకుంటాడు అని ఏ ధర్మం చెప్పలేదు, మరో మనిషిని చంపడం పుణ్యం అని ఏ గ్రంథమూ బోధించలేదు. మరి ఈ చిమ్మచీకటి లాంటి ద్వేషం, హింస ఎక్కడి నుండి పుట్టుకొస్తున్నాయి? ఈ అనంతమైన సముద్రాలు, నీలాకాశం, పచ్చని పర్వతాలు, కిలకిలరావాల పక్షులు, వీటన్నింటినీ ప్రాణం పోసి సృష్టించిన ఆ మహాశిల్పి కి తన సృష్టిపై కోపం ఉంటుందా? అసాధ్యం! తన చిత్రపటాన్ని తనే చింపేసుకునే చిత్రకారుడు ఉండడు. తన బిడ్డను శపించే తల్లి కనిపించదు. అలాంటప్పుడు, సర్వశక్తిమంతుడైన ఆ సృష్టికర్త తన ప్రతిరూపమైన మనిషిని ద్వేషిస్తాడనుకోవడం తర్కానికే అందని విషయం. మహాత్మా గాంధీ ఒక సందర్భంలో అన్నట్టుగా నేను హిందువుని, ముస్లింని, క్రైస్తవుణ్ణి కూడా! ఎందుకంటే నిజమైన మతం మనుషులను కలిపే వంతెన కావాలి కానీ, విడదీసే గోడ కాకూడదు. ఈ మాటల్లో ఎంతటి గంభీరమైన సత్యం దాగి ఉంది! దేవుడు మనల్ని మతాల వారీగా విడదీయడానికి ఈ సృష్టిని చేయలేదు. కానీ, మనిషే తన స్వార్థ ప్రయోజనాల కోసం, అధికార కాంక్ష కోసం ఆ కరుణామయుడిని ఒక రాజకీయ అస్త్రంగా మార్చేశాడు. దేవుడి పేరిట మనం నిర్మించుకున్న ఈ సరిహద్దులు ఆయన సృష్టించినవి కావు . మన అహంకారం గీసుకున్న గీతలు మాత్రమే. మహర్షి రమణులను ఒక శిష్యుడు అత్యంత కుతూహలంతో అడిగాడు స్వామీ! అసలు ఆ దేవుడు ఎలా ఉంటాడు? ఆ ప్రశ్నకు మహర్షి పెదవులపై ఒక అందమైన చిరునవ్వు విరిసింది. నువ్వు ఎలా ఉంటావో, ఆ దేవుడూ అలాగే ఉంటాడు! నిన్ను సృష్టించిన ఆ పరమాత్మకు నీ స్వరూపం తప్ప వేరే ఏం తెలుస్తుంది? అని బదులిచ్చారు. ఈ చిన్న మాటలో ఎంతటి పరమార్థం దాగి ఉంది! దైవం ఎక్కడో సుదూర తీరాల్లో, ఆకాశం అవతల దాగి ఉన్న రహస్యం కాదు. అది మనలోనే, మన ప్రతి శ్వాసలోనూ అంతర్లీనంగా ఉన్న సత్యం. నేటి భారతదేశంలో మతాల పేరిట జరుగుతున్న ఘర్షణలను చూస్తుంటే మనసు చివుక్కుమంటుంది. ఒకవైపు గుడిలో జై శ్రీరామ్ అంటూ భక్తి పారవశ్యం, మరోవైపు మసీదులో అల్లాహు అక్బర్ అని వినిపించే ప్రార్థనా నాదం ఇంకోవైపు చర్చిలో హల్లెలూయా అంటూ సాగే స్తోత్రాలు. కానీ, ఆ ఆధ్యాత్మిక ప్రాకారాలు దాటి బయటకు రాగానే అదే మనిషి మారిపోతున్నాడు. నా దేవుడే గొప్ప నీ మతం తప్పు అంటూ తోటి మనిషిపైకి కత్తిగడుతున్నాడు. ఇక్కడే ఒక విషాదకరమైన వ్యంగ్యం దాగి ఉంది ప్రతి మతం లోపల ప్రేమ ను బోధిస్తుంటే, అదే మనిషి బయట మాత్రం ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నాడు. దైవప్రార్థన గడప దాటలేకపోవడం మన కాలపు అతిపెద్ద వైఫల్యం. ఈ సామాజిక రుగ్మతను లోతుగా పరిశీలించిన శాస్త్రవేత్తలు మూడు కీలక కారణాలను మన ముందుంచారు. మొదటిది అజ్ఞానం,విచారకరమైన విషయం ఏమిటంటే, చాలామందికి తమ సొంత మతం లోతులే తెలియవు, ఇక పరమతాన్ని అర్థం చేసుకోవడం అటుంచితే కనీసం గౌరవించడం కూడా నేర్చుకోలేదు. రెండవది రాజకీయ స్వార్థం అధికారం కోసం, ఓట్ల వేటలో మతాన్ని ఒక వాడియైన ఆయుధంగా మలచుకుని సమాజాన్ని ముక్కలు చేస్తున్నారు నేటి నాయకులు. ఇక మూడవది చారిత్రక గాయాలు. శతాబ్దాల కిందట జరిగిన చేదు సంఘటనలు నేటికీ వారసత్వంగా అందుతూనే ఉన్నాయి. ఆ పాత గాయాలను మాన్పే ప్రయత్నం చేయాల్సింది పోయి, వాటిని మళ్ళీ రేపి రక్తం చిందించే వారే ఎక్కువయ్యారు చరిత్ర పుటలు తిరగేస్తే ఒక భయానక వాస్తవం మనల్ని వెక్కిరిస్తుంది మతం పేరిట జరిగిన యుద్ధాల్లో కోట్లాది మంది అమాయకులు బలైపోయారు. కానీ, ఆ రక్తం చిందిన తర్వాత ఏ దేవుడూ వచ్చి ఒక పక్షానికి స్వర్గం ఇచ్చిన దాఖలాలు లేవు, ఈ మతమే గెలిచింది అని ఏ శక్తీ ప్రకటించలేదు. అయినా సరే, మనిషి పదే పదే అదే రక్తపాతాన్ని పునరావృతం చేస్తూనే ఉన్నాడు. భిన్నత్వంలో ఏకత్వం అన్న నినాదంపై వెలసిన మన భారతదేశం, ప్రతి పౌరుడికి తన ఇష్టదైవాన్ని కొలుచుకునే స్వేచ్ఛను రాజ్యాంగబద్ధంగా కల్పించింది. కానీ నేటి వాస్తవం భిన్నంగా ఉంది. గోహత్యల పేరిట జరుగుతున్న దాడులు, ప్రార్థనా మందిరాల విధ్వంసం, మత మార్పిడి చుట్టూ ముసురుతున్న వివాదాలు ఇవన్నీ మన దేశ ఆత్మను ముక్కలు చేస్తున్నాయి. ప్రపంచ మత యవనికపై భారతం అందించిన గొప్ప కానుక హిందూ ధర్మం. వసుధైక కుటుంబం అనే విశాల భావనను, అపరిమితమైన సహనాన్ని చాటిన ఈ ప్రాచీన ధర్మం, నేడు కొందరి అతివాద ధోరణుల వల్ల తన అసలు స్వరూపాన్ని కోల్పోయే ప్రమాదంలో పడింది. మరోవైపు, సలాం అంటేనే శాంతి అని అర్థం కలిగిన ఇస్లాం, కొందరి వికృత వ్యాఖ్యానాల వల్ల ప్రపంచవ్యాప్తంగా అపార్థాల నీడలో చిక్కుకుంది. ఇక ప్రేమను, సేవను పరమార్థంగా భావించే క్రైస్తవం, నేడు మతమార్పిడి వివాదాల సుడిగుండంలో పడి తన సేవా ముద్రను కోల్పోతోంది. మతాల అసలు ఉద్దేశం పక్కకుపోయి, బాహ్య రూపాలే వివాదాలకు కేంద్రబిందువులవుతున్నాయి. ఈ మూడు మతాల మూల సిద్ధాంతాలను లోతుగా తరచి చూస్తే, ఒక అద్భుతమైన సత్యం మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. భాషలు వేరైనా, భావం ఒక్కటే! నీ పొరుగువాడిని నిన్ను నువ్వు ప్రేమించుకున్నట్టే ప్రేమించు అని బైబిల్ ఉద్బోధిస్తే మనమంతా ఒకే సృష్టికర్త సంతానం అని ఖురాన్ సోదరభావాన్ని చాటింది. ఇక భగవద్గీతలోని ఆత్మవత్ సర్వభూతేషు అంటే అన్ని ప్రాణుల్లోనూ నీ ఆత్మనే దర్శించు అన్న మాట ఇవన్నీ కలిపి చదివితే అర్థమయ్యేది ఒక్కటే మానవత్వానికి మించిన మతం లేదు! మత సామరస్యం అనేది కేవలం అందమైన కల కాదు, అది సాధ్యమయ్యే అద్భుతం. కానీ ఆ మార్పు మన గుండెల్లో మొదలై, దేశం నలుమూలలా ఒక ప్రవాహంలా సాగాలి. నిజమైన మార్పు తరగతి గది నుంచే మొదలవ్వాలి. మన విద్యావ్యవస్థలో సంస్కరణలు రావాల్సిన సమయం ఆసన్నమైంది. పాఠ్యపుస్తకాలు కేవలం పాఠాలు చెబితే సరిపోదు, అన్ని మతాల సారాన్ని సమానంగా బోధించాలి. చిన్నతనం నుంచే పసిమనసుల్లో మతాలు వేరైనా, మనం ఒకే మానవత్వానికి చెందిన వాళ్ళం అన్న బీజాలు నాటాలి. ద్వేషం లేని ఒక్క తరం పెరిగినా చాలు.. రేపటి భారతదేశం అద్భుతమైన ప్రశాంత నిలయంగా మారుతుంది. ఇక మీడియా విషయానికొస్తే బాధ్యత అనేది ఒక పదం కాదు, అది ఒక ధర్మం. టీఆర్పీ (TRP) కోసం మత ఘర్షణల మంటలను గాలి పోసి పెద్దవి చేస్తున్న నేటి మీడియా సంస్థలు సామరస్యంగా జీవిస్తున్న వేలాది కుటుంబాల కథలను ఎందుకు దాచి పెడుతు న్నాయి? ఒక హిందూ కుటుంబం తన ముస్లిం పొరుగువారికి అండగా నిలిచినప్పుడు అది ఎందుకు వార్త అవ్వదు? ఒక క్రైస్తవ వైద్యుడు పేద హిందూ రోగికి ఉచితంగా ప్రాణదానం చేసిన కథ ఎందుకు ప్రసారం కాదు? మంచిని వెలికితీసి, మానవత్వాన్ని చాటి చెప్పడమే మీడియా నిజమైన ధర్మం. రాజకీయ నాయకుల్లో జవాబుదారీతనం కేవలం ఎన్నికల నినాదం కాకూడదు. ఓట్ల కోసం మతాన్ని అడ్డం పెట్టుకునే ఏ నాయకుడైనా సరే, చట్టం ముందు మోకరిల్లాల్సిందే. విద్వేషపూరిత ప్రసంగాలతో మంటలు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేయకూడదు. నిజం చెప్పాలంటే మత రాజకీయాలు భారత ప్రజాస్వామ్యానికి పట్టిన క్యాన్సర్. దీనిని సకాలంలో శస్త్రచికిత్స చేసి తొలగించకపోతే, మన సమాజం లోపలి నుండే కుళ్ళిపోతుంది. అదే సమయంలో, మతాల మధ్య సంభాషణ (Interfaith Dialogue) ఒక నిరంతర ప్రక్రియగా సాగాలి. వేర్వేరు మతాల పీఠాధిపతులు, పండితులు, మేధావులు ఒకే వేదికపైకి వచ్చి ఒకరి దైవాన్ని మరొకరు అర్థం చేసుకున్నప్పుడే అసలైన సామరస్యానికి పునాది పడుతుంది. గుజరాత్ అల్లర్ల వంటి విపత్కర సమయాల్లో సుల్తాన్ అహ్మద్ శంకర్ భాయ్ వంటి మహనీయులు చూపిన మార్గమే నేటి కాలానికి సరైన దిశానిర్దేశం. యువతే ఈ దేశానికి వెన్నెముక! 65 కోట్ల యువ హృదయాల చేతుల్లోనే రేపటి భారతదేశ భవిష్యత్తు దాగి ఉంది. ఆ యువత మతాల మత్తులో తూగే కంటే మానవత్వపు వెలుగులో నడవాలి. సోషల్ మీడియాలో ద్వేషపు మంటలను వ్యాపింపజేసే బదులు, ప్రేమను, సాయాన్ని పంచుతూ ఒక సరికొత్త చరిత్రను లిఖించాలి. ఒక్క యువతరం మారితే చాలు ఈ దేశపు రాత మారిపోతుంది. ఒక్క క్షణం ఆలోచించండి ఈ మత ఘర్షణలను, రక్తపాతాన్ని చూసి ఆ సృష్టికర్త ఏమనుకుంటున్నాడు? తన పేరు చెప్పుకుంటూ మనుషులు ఒకరినొకరు చంపుకుంటుంటే ఆ కరుణామయుడు ఎంతగా విలవిలలాడుతుంటాడు! ఆయన పేరిట ఆలయాలు, మసీదులు, చర్చిలు నిర్మించి, ఆ గోడల సాక్షిగా ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకుంటుంటే ఆ దేవుడు ఆశ్చర్యపోతున్నాడో లేక తన సృష్టిని చూసి కన్నీరు మున్నీరవుతున్నాడో? మనిషిలో మానవత్వం చచ్చినప్పుడు, రాతి విగ్రహాల వెనుక దైవం ఎందుకు ఉంటుంది? చివరిగా ఒక సత్యం ఏ దేవుడూ తన పేరిట హింసను ఆదేశించలేదు. ఏ పవిత్ర గ్రంథమూ ద్వేషించు చంపు అని బోధించలేదు. ఆ నెత్తుటి అక్షరాలు మనుషులు రాసుకున్నవి, స్వార్థపరులు తమకు అనుకూలంగా మార్చుకున్నవి మాత్రమే! ఆకాశం ఒకటే అయినా మనకు వేర్వేరు దిక్కుల్లో కనిపిస్తుంది, సముద్రం ఒకటే అయినా వేర్వేరు తీరాలను తాకుతుంది. దైవం కూడా అంతే! ఈ నిజాన్ని మనం మనస్ఫూర్తిగా నమ్మిన నాడు, మతాల మధ్య మనిషి కట్టుకున్న గోడలు పేకమేడల్లా కూలిపోతాయి. అప్పుడే ఈ భరతభూమి సర్వేజనాః సుఖినోభవంతు అన్న మహోన్నత ఆశయానికి నిలువుటద్దంలా నిలుస్తుంది. మత సామరస్యం కోసం ఎవరో వస్తారని వేచి చూడాల్సిన పనిలేదు మత సామరస్యం అనేది ఒక అద్భుత యజ్ఞం, అందులో మొదటి సమిధ మీరే కావాలి. మీ పొరుగువారి మతాన్ని కాదు, వారిలోని మానవత్వాన్ని ప్రేమించండి. మీరు ఇచ్చే ఒక చిన్న చిరునవ్వు, ఒక ఆత్మీయ పలకరింపు, ఏ దేవాలయంలోనో దొరకని ప్రశాంతతను, దైవత్వాన్ని మీకు ప్రసాదిస్తాయి.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ హైమవతి



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 25 : మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో 82 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, మొత్తం 15,358 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సరిపడ ఫర్నిచర్, త్రాగునీరు, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అవసరమైన మందులతో ఏఎన్ఎంను ప్రతి కేంద్రంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రశ్నాపత్రాల భద్రపరిచే కేంద్రాలు, పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యార్థులు సమయానికి చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని సమయానికి నియమించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. సమావేశంలో అదనపు డిసిపి కుశాల్కర్, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్ఓ నాగరాజమ్మ, డిఎం & హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, డిఎం ఆర్టీసీ భవభూతి, డిపిఆర్ఓ రవికుమార్, ఎలక్ట్రిసిటీ డిఈ శ్రీనాథ్, పోస్టల్ అధికారి సంతోష్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పరిశీలించిన కలెక్టర్

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్-2026 బోర్డు మార్గదర్శకాల ప్రకారం పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని చీఫ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. పరీక్షల సమయంలో ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు అనుమతించరాదని, పూర్తిస్థాయి తనిఖీ అనంతరం మాత్రమే విద్యార్థులను లోపలికి అనుమతించాలని తెలిపారు. కేంద్రం పరిసరాల్లో సెక్షన్ 144 అమలు చేయడంతో పాటు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

కేజీబీవీని తనిఖీ చేసిన కలెక్టర్



సిద్దిపేట రూరల్ మండలం రాఘవపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, గుడ్డు కూర, ఆలుగడ్డ టమాట కూరలను తనిఖీ చేసిన కలెక్టర్ బిర్యానీ అన్నం నాణ్యత సరిగా లేదని గమనించారు. బిర్యానీలో అవసరమైన పదార్థాలు లేకుండా వండడం పట్ల వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనాన్ని నాణ్యంగా, రుచికరంగా తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి కూరగాయలు, వంట సరుకుల నిల్వలను తనిఖీ చేశారు. నాణ్యమైన సరుకులనే వినియోగించాలని, గడువు ముగిసిన పదార్థాలను ఉపయోగించరాదని సూచించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించినప్పుడు నమోదు చేసిన సరుకులకు, వాడిన సరుకులకు పొంతనలేదని గుర్తించి సంబంధిత ఎస్ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారికి (డిఈఓ) ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థినుల భోజనం, వసతి విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షణ బలోపేతం చేయాలని పేర్కొన్నారు. అలాగే పాఠశాల మరుగుదొడ్లు, పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, ప్రహరీ గోడపై సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.



ఇంటర్ పరీక్ష కేంద్ర్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఎస్పీ డి.వి శ్రీనివాస రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 25 : బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జిల్లా కేంద్రంలోని వివిధ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును, భద్రతా ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును పటిష్టంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అనవసర గుంపులు ఏర్పడకుండా చూడాలని, సెల్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవద్దని అధికారులకు తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. ప్రశ్నపత్రాల రవాణా సమయంలోనూ, పరీక్షలు ముగిసిన అనంతరం జవాబు పత్రాలను పూర్తిస్థాయి పోలీస్ బందోబస్తుతో సురక్షితంగా తరలించాలని సూచించారు. ఎస్పీ వెంట డిఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ సిఐ మహేష్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

దుండగులను చట్టపరంగా శిక్షించాలి



ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 25 : నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామ జాతరలో టిక్కెట్ లేదు అనే కారణంగా ఆలయంలోకి ప్రవేశించిన బీసీ చాకలి కుటుంబానికి చెందిన కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ , రెడ్డి లు అత్యంత పాశవికంగా మహిళలపై దాడి చేసి, రెండు నెలల పసికందు బేబీ మౌనికను కాళ్ళతో తొక్కి చంపిన సంఘటన మానవ సమాజానికే సిగ్గు చేటుఅని ధర్మాసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాగట్ల. చందు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సంఘటనలో నిందితులుగా ఉన్న తుకారాం రెడ్డి ,సతీష్ రెడ్డి,మాధవ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,మధుసూధన్ రెడ్డి లను అరెస్ట్ చేసి చట్ట పరంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పరారీలో ఉన్న నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరు పరిచి వారికి తగిన శిక్ష పడేలా చూడాలన్నారు. అగ్రకుల దురహంకార ఆధిపత్యంతో జరిగిన ఈ దాడిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా మరోసారి ఇలాంటి సమస్యలు పురవృతం కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే ఇలాంటి ఘటన జరగడం దీనిని సీరియస్ గా తీసుకోలేకపోవడం దారుణమని ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. లేకపోతే ధర్మసమాజ్ పార్టీ , బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

యూరియా మొబైల్ బుకింగ్ యాప్‌కు విశేష స్పందన

జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 25 : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ ఎరువుల బుకింగ్ యాప్‌కు జిల్లాలో రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ యాప్ ద్వారా జిల్లా వ్యాప్తంగా పట్టా పాస్‌బుక్ ఉన్న రైతులు 2,83,164 యూరియా బ్యాగులు బుక్ చేసుకోగా, అందులో 2,35,798 బ్యాగుల కొనుగోలు పూర్తైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి తెలిపారు. పట్టా పాస్‌బుక్ లేని రైతులు 1,007 బ్యాగులు బుక్ చేసుకోగా 838 బ్యాగులు, కౌలు రైతులు 1,198 బ్యాగులు బుక్ చేసుకోగా 949 బ్యాగులు కొనుగోలు చేసినట్లు వివరించారు. మొత్తంగా జిల్లాలో 2,85,359 యూరియా బ్యాగులు బుక్ చేయబడగా, అందులో 2,37,585 బ్యాగుల కొనుగోలు పూర్తయ్యిందని ఆమె తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సులభంగా యూరియా కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

యాప్ ప్రత్యేకతలు..

అవసరానికి అనుగుణంగా, సమయానికి యూరియా అందించడమే లక్ష్యంగా భారతదేశంలోనే తొలి వినూత్న నమూనాగా ఈ మొబైల్ ఎరువుల బుకింగ్ యాప్‌ను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. గతంలో ఎరువుల పంపిణీలో డీలర్ కేంద్రాల వద్ద భారీ క్యూలు, నిల్వలపై అనిశ్చితి, భయంతో అధిక కొనుగోలు, బ్లాక్ మార్కెటింగ్ వంటి సమస్యలు ఎదురయ్యేవని గుర్తుచేశారు. ఈ యాప్ ద్వారా రైతులు సినిమా టికెట్ బుకింగ్ మాదిరిగా సులభంగా యూరియా బుక్ చేసుకోవచ్చని, తమ ప్రాంతంలోని స్టాక్ వివరాలను రియల్ టైమ్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. బుకింగ్ నిర్ధారణ వచ్చిన తర్వాత మాత్రమే డీలర్ వద్దకు వెళ్లే అవకాశం ఉండటంతో క్యూ లైన్ల సమస్య పూర్తిగా తగ్గిందన్నారు.

శాస్త్రీయ కేటాయింపు..

సమర్థ వినియోగం

పంట, సాగు విస్తీర్ణం, పట్టా పాస్‌బుక్ వివరాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల సిఫారసుల ఆధారంగా శాస్త్రీయంగా ఎరువుల పరిమాణాన్ని నిర్ణయించి విడతల వారీగా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఎరువుల సమర్థ వినియోగం సాధ్యమవుతూ, పంటల ఆరోగ్యం మెరుగుపడుతోందన్నారు.

రాష్ట్ర స్థాయి ఫలితాలు

2026 ఫిబ్రవరి 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 12.73 లక్షల మంది రైతులు యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోగా, 50.48 లక్షల సంచులు బుక్ అయ్యాయని, అందులో 46.13 లక్షల సంచుల కొనుగోలు పూర్తయ్యిందని తెలిపారు. ఈ గణాంకాలు యాప్‌పై రైతుల విశ్వాసాన్ని స్పష్టంగా చూపుతున్నాయని అన్నారు. క్యూలో నిలబడే సమస్యకు పరిష్కారంగా ప్రారంభమైన ఈ యూరియా మొబైల్ బుకింగ్ యాప్ ప్రస్తుతం రైతు సౌలభ్యం, పారదర్శకత, బ్లాక్ మార్కెట్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తూ జాతీయ స్థాయిలో అనుసరించదగిన నమూనాగా నిలుస్తోందని డీఏవో స్వరూప రాణి పేర్కొన్నారు.

సిద్దిపేట మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు

ఏసీబీ విచారణ చేపట్టాలి

సామాజిక కార్యకర్త గాధగోని చక్రధర్ గౌడ్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 25 : సిద్దిపేట మున్సిపాలిటీలో అవినీతి రాజ్యం నెలకొంది అని సామాజిక కార్యకర్త గాధగోని చక్రధర్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ జాతీయ వజ్రోత్సవాల సందర్భంగా నిధుల గోల్‌మాల్ జరిగిందని పేర్కొంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ కడవెరుగు మంజుల రాజనర్సు పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తెలంగాణ జాతీయ వజ్రోత్సవ వేడుకల నిర్వహణలో సుమారు రూ.7.5 లక్షల మేర నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. ఈ అంశంపై ఏసీబీ విచారణ ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. మున్సిపల్ బాక్స్ టెండర్ల పేరిట ప్రజాధనాన్ని దారి మళ్లిస్తున్నారని, మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఆధ్వర్యంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మున్సిపల్ అవినీతి వ్యవహారంపై ప్రతిపక్ష పార్టీల నాయకులు మౌనం వహించడం బాధాకరమని అన్నారు. అవినీతిలో భాగస్వామ్యులైన అధికారులు, రాజకీయ నాయకులపై రాజీలేని పోరాటం కొనసాగిస్తానని గాధగోని చక్రధర్ గౌడ్ స్పష్టం చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రతిపక్షం, మిడిదొడ్డి, ఫిబ్రవరి 25 : మిరుదొడ్డి మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ స్వామి దేవస్థాన నూతన కార్యవర్గాన్ని బుధవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు జనార్ధన్, ఉపాధ్యక్షులుగా గడ్డం స్వామి, చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం ఆంజనేయులు, సుతారి ఆంజనేయులు, కోశాధికారిగా గడ్డం నర్సింలు, ప్రధాన సలహాదారులుగా సుతారీ రమేష్, గడ్డం బాలనారాయణ, సభ్యులుగా సుతారి వెంకటేశం, గడ్డం శ్రీనివాస్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జనార్ధన్ మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈనెల 26న దేవస్థాన 39వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.



మెదక్‌లోనే టెన్త్ స్పాట్ వాల్యుయేషన్

ఎమ్మెల్యే రోహిత్‌కు ఉపాధ్యాయ సంఘాల అభినందనలు



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 25 :- గతంలో అన్ని రంగాల్లో వెనుకబడిన మెదక్ జిల్లాకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ప్రత్యేక చొరవతో మెదక్ జిల్లా కేంద్రం కు ఎంతో గుర్తింపునిస్తుంది. ఇటీవలే మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించడంతోపాటు బుధవారం బోర్డ్ ఆఫ్ సెకండరీ అధికారులతో మాట్లాడి మెదక్ లోనే టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కోసం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అధికారులతో మాట్లాడి మెదక్ లోని ఏర్పాటు చేసేలా అనుమతి ఇస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం పట్ల గతంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూడా ఎమ్మెల్యేను కలిసి విన్నవించుకున్నారు. ఎట్టకేలకు మెదక్ కు టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ తీసుకురావాలనే పట్టుదలతో ఎమ్మెల్యే రోహిత్ ఉన్నత విద్యాశాఖ అధికారులతో మాట్లాడి మెదక్ లోనే స్పాట్ వాల్యుయేషన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ గుర్తింపు రావడం కోసం ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి మెదక్ స్పాట్ వాల్యుయేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేసినందుకుగాను ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రాంత ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా మెదక్ ప్రాంతానికి విద్యారంగంలో వివిధ గుర్తింపు హోదాల కోసం కృషి చేసిన ఎమ్మెల్యే రోహిత్ రాబోయే రోజుల్లో మెదక్ మరింత పేరు తీసుకువచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్ర్రాలను తనిఖీ చేసిన మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 25 :- ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించే క్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం పరీక్షల తొలి రోజున కొల్చారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా హాళ్లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును, పరీక్షల నిర్వహణ విధానాన్ని నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలను తెరిచారా లేదా అన్నది పరిశీలించారు. సీసీటీవీ నిఘా మధ్య ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, మెడికల్ కిట్‌తో ఏఎన్ఎం అందుబాటులో ఉండటం, టాయిలెట్ వసతులు వంటి మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షలు పూర్తైన వెంటనే ఆన్సర్ షీట్లను తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు సురక్షితంగా తరలించాలని సూచించారు. ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సంబంధిత పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మరియు అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సిబ్బందిని ఆదేశించిన మున్సిపల్ చైర్మన్

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 25 : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్ మరియు వార్డ్ కౌన్సిలర్ మమతా పోచయ్యతో కలిసి మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి పట్టణంలోని మురికి కాలువల సమస్యను బుధవారం నాడు పరిశీలించారు. అలాగే కొన్ని చిన్న చిన్న మైనర్ రిపేర్లు, మురికి కాలువలకు చేయడం గురించి సిబ్బందికి సూచించారు. దీంతో వెంటనే మున్సిపల్ సిబ్బంది మురికి కాలువలను శుభ్రం చేయడం జరిగింది. మరియు వార్డులో ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందు, వార్డు బిఆర్ఎస్ అధ్యక్షులు బాకీ స్వామి, పార్టీ సీనియర్ నాయకులు పొన్నాల కుమార్, పాములపర్తి స్వామి, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





కలియుగ దైవం వేంకటేశ్వరుడికి కల్తీ నెయ్యితో చేసిన ప్రసాదాన్ని నైవేద్యంగా పెట్టారు. కెమికల్స్‌తో నెయ్యి కల్తీ చేసి 20 కోట్ల లడ్డూలను తయారుచేశారు. వాళ్లు అన్యాయం చేసి ఎలాంటి సంబంధం లేని హెరిటేజ్‌పై నిందలు మోపుతున్నారు. ఆ రోజు కూడా బాబాయ్‌ని చంపేసి.. మరుసటి రోజు నారాసుర రక్తచరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టారు.
- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం



ఆలయానికి హరీశ్ రావు రూ.లక్ష విరాళం

అభయాంజనేయ ఆలయ కమిటీ అధ్యక్షుడికి అందజేత

ప్రతిపక్షం, నంగునూరు, ఫిబ్రవరి 25 : నంగునూరు అభయాంజనేయ దేవాలయ పునర్నిర్మాణానికి మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు రూ.లక్ష విరాళాన్ని అందించారు. ఈ మేరకు సిద్ధిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి నంగునూరు గ్రామ పెద్దల సమక్షంలో అభయాంజనేయ ఆలయ కమిటీ అధ్యక్షుడు మెతుకు హన్మంతరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ అభయాంజనేయ ప్రతిష్ఠా మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీకి సూచించారు. అభయాంజనేయుడి ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఉండాలని, ఆంజనేయుడి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు మెతుకు హన్మంతరెడ్డి మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంగునూరు సర్పంచి సనాదుల బాల పోచయ్య, నంగునూరు గ్రామ పురోహితుడు ఆదిరాల సాయినాథ శర్మ, ఉపసర్పంచి కోల శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు చౌదుచర్ల జయపాల్ రెడ్డి, సిరికొండ మణి, నంగునూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ కోల రమేశ్ గౌడ్, నాయకులు చింతల రాంరెడ్డి, చింతల కిష్టయ్య, ఉల్లి మల్లయ్య, దేవులపల్లి కనకయ్య, ఆకుబత్తిని రాము, తుపాకుల దుర్గేశం, దాసరి రవికుమార్, తుపాకుల నరేశ్, పెద్ది లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.





రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం
- మెదక్ జిల్లా ఎస్పీశ్రీనివాస రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 25 : రోడ్డు ప్రమాదాలు నివారించడం, ప్రమాదాల్లో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకుండా సురక్షితంగా గమ్యం చేరడం లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ శాఖ చేపట్టిన అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...దేశంలో రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకూ ఆందోళనకరంగా మారుతున్నాయని అన్నారు. మెదక్ జిల్లాలో గత సంవత్సరం 287 మంది ప్రాణాలు కోల్పోయి, 631 మంది గాయపడ్డారని పేర్కొన్నారు. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదని, ప్రతి ప్రమాదం వెనుక ఒక కుటుంబం కన్నీరు ఉందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 60 శాతం ద్విచక్ర వాహనాలకు సంబంధించినవేనని అన్నారు. ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి అంశాలను వివరించారు. ప్రతి సంవత్సరం నమోదయ్యే హత్యల సంఖ్యతో పోలిస్తే, రోడ్డు ప్రమాదాలు ఎన్నో రెట్లు ఎక్కువ ప్రాణాలను తీసుకుంటున్నాయని, ఇది ప్రజల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఇటీవల శంకర్‌పట్ మండలంలో ఒకే బైక్ ప్రమాదంలో నలుగురు మృతి చెందిన ఘటన సమాజానికి గట్టి హెచ్చరికగా నిలుస్తోందన్నారు.ద్విచక్ర వాహనాలు నడిపే రైడర్, పిలియన్ ఇద్దరూ ISI ప్రమాణిత హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు.

అలాగే అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయరాదని, ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయకూడదని, మైనర్లు డ్రైవింగ్ చేయరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుటుంబాల భద్రత కోసం, మన భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని కోరారు.చివరగా విద్యార్థులతో రోడ్డు భద్రత అవగాహనా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్,కళాశాల ప్రిన్సిపాల్ ఉస్సేన్, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ మహేష్,కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమారెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 25 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో మహిళలకు రక్షణ కరువైందని బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి ఉమా రెడ్డి అన్నారు.సిద్ది పేటలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సిద్ది పేట కాళ్లకుంట కాలనీకి చెందిన వివాహిత మహిళపై కాంగ్రెస్ నాయకుడు అత్యాచారయత్నం చేయడం దారుణమని ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడికక్కడ మహిళలపై అఘాయిత్యాలు అత్యాచారాలు పెరిగిపోయాయని ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆమె మండిపడ్డారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు తాము ఏం చేసినా చెల్లుతుందని అహంకారంతో ఒక మహిళపై అత్యాచారయత్నం చేసి గాయపరచడం సిగ్గుచేటని, ఇలాంటి దుండగులను కఠినంగా శిక్షించాలని ఆమె అన్నారు. పోలీసు యంత్రాంగం ఇలాంటి సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని దుండగులను కఠినంగా శిక్షించాలని అన్నారు.ప్రభుత్వాలు మహిళా సాధికారత అంటూ ఎన్ని కార్యక్రమాలు చేపట్టిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో సమాజంలో మహిళలకు రక్షణ లేదని,పట్టపగలు మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ఎన్ని రక్షణ చట్టాలు తీసుకొని వచ్చిన ఏలాంటి ప్రయోజనం చేకూరడం లేదని మహిళా చట్టాల పైన మగవాళ్లకు నిర్బంధ శిక్ష ఇవ్వడంతో పాటు నేరానికి పాల్పడ్డ వారిపై కఠినమైన శిక్షలు ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేకుండా శిక్షించినప్పుడే కొంత వరకు సమాజంలో అరికట్టగలుగుతామని అన్నారు.బాధిత మహిళకు భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.



నిందితులపై హత్య కేసు నమోదు చేయాలి

- కుమ్మెర సర్పంచ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి
- సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 25 : కుమ్మెర జాతరలో పసిబిడ్డను చంపిన దుండగులను అరెస్టు చేయకుండా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడాన్ని సిపిఎం మెదక్ జిల్లా పార్టీ ఖండించింది. నాగర్ కర్నూల్,కుమ్మెర గ్రామంలో జాతరలో చనిపోయిన చిన్నారి మరణానికి నిరసన గా మెదక్ జిల్లా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలం, కుమ్మెర గ్రామంలో గత ఆరు రోజుల క్రితం జాతరలో చిన్నారిని హత్య జరిగిన విషయం తెలిసిందే .పాప చావుకు కారణం అయిన పెత్తందారులను వెంటనే అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కుమ్మెర జాతరలో దాడి చేయడమే కాకుండా రజక, దళిత కుటుంబాల మహిళల పై దాడి చేయడంతోపాటు చంటి పిల్లను హత్య చేసిన భూస్వామ్య దొరలు, పెత్తందారులు శ్రీనివాస్‌రెడ్డి, మధురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, దాడి చేసిన ఆలయ నిర్వాహకులపై తక్షణమే హత్యానేరం కింద కేసు నమోదుచేయాలని అన్నారు. వారిని అరెస్టు చేయకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. చిన్నారిని చంపిన ఘటన జరిగి వారం రోజులు దాటినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారుణమన్నారు. కుమ్మెర సర్పంచ్‌నూ అరెస్ట్ చేయాలని తెలిపారు. పోలీసులు బాధితుల ఫిర్యాదును పట్టించుకోకుండా నిందితులిచ్చిన దరఖాస్తు ఆధారంగా దళిత కుటుంబంపై కేసులు బనాయించడం దారుణమన్నారు.దాడి చేసిన పెత్తందారులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో కేసును నీరుకార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని తెలిపారు. దాడి జరిగిన దగ్గర ప్రత్యక్ష సాక్షులుగా నిలబడి చూస్తున్న పోలీసు అధికారులు సి ఐ, ఎస్ ఐ, డీఎస్పీ లు దాడి చేస్తున్న వారిని ఆపకుండా చోద్యం చూడడం ఏమిటని ప్రశ్నించారు.వారిని వెంటనే సస్పెండ్ చేయాలని అన్నారు. బాధితులకు న్యాయం చేయకుండా దాడికి పాల్పడిన వారి పక్షాన నిలబడి పేదల పైననే కేసులు నమోదు చేయడం పట్ల పోలీసు యంత్రాంగం గాని, అధికారుల వైఖరి గానీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. పుట్టి రెండు నెలలు కూడా పూర్తవని చిన్నారి పాపకు ఈ పెత్తనం దారులు కులం పేరు తో పొట్టన పెట్టుకున్నారన్నారు.రాష్ట్రం లో ఎన్ని కుల దురంకార హత్యలు జరిగిన ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు.చిన్నారి మరణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటి వరకు మాట్లాడి దుండగులను శిక్షించాలని,లేదా అరెస్టులు చేయాలని,బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని కూడా మాట్లాడే ప్రయత్నం చేయలేరని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి అగ్రకులాల వారికే పని చేస్తారా,పేదలకు న్యాయం చేయరా అని ఆమె ప్రశ్నించారు.ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి చిన్నారి మరణానికి కారణం అయిన వారిని అరెస్టు చేసి ,శిక్షించాలని ,బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె మల్లేశం, జిల్లా కమిటి సభ్యులు, పార్టీ సభ్యులు సంతోష్ యశోద, కమల దుర్గ, యశోద, కవిత, షౌకత్, కిష్టయ్య, యాదగిరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కవాతు

దుబ్బాక సిఐ టి. రాజేష్

ప్రతి పక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 25 : జిల్లా బౌగోళిక పరిస్థితులను అర్థం చేసుకోవడంతో పాటు ప్రజల శాంతి భద్రతల పరిరక్షణకే రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో ఫ్లాగ్ మార్చ్ (కవాతు) నిర్వహించినట్లు దుబ్బాక సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.రాజేష్ తెలిపారు. బుధవారం దుబ్బాక పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత ఘర్షణలు, శాంతి భద్రతల సమస్యలు వస్తే వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితులను అదుపు చేయడంలో స్థానిక పోలీసులకు రాపిడ్ యాక్షన్ బలగాలు సహకరిస్తాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి గురించి ఏదైనా సమాచారం ఉంటే తక్షణమే పోలీసులకు తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ సరస్వతి, దుబ్బాక ఎస్సై కీర్తి రాజు, ఆర్ఎఎఫ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు

మాజీ ఎమ్మెల్యే తూంకుంట

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), ఫిబ్రవరి 25: పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం కాగా, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు వర్తింప చేస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం వర్గల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ నూతన గృహప్రవేశాలు చేయించిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో 3 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళా సాధికారత లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించగా, మహిళల చేతుల్లోనే కుటుంబ ఆర్థిక స్థితిలో బాగుంటాయనే లక్ష్యంతో ప్రభుత్వ పథకాలను మహిళల పేరిటనే కేటాయిస్తున్నట్లు చెప్పారు. అలాగే కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు పాత కార్డులలో సభ్యులను చేర్చి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతే కాకుండా పంట రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి రూ 500 బోనస్ తదితర సాహసోపేత నిండాయాలతో పాటు గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల



లోపు ఉచిత కరెంట్, 500కే వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు వడ్డీ లేని రుణాలు తదితర అందజేస్తూన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు కడపల నర్సింహారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు బాల్రెడ్డి, నేతలు తవిటి కిష్టయ్య గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, అరవింద్ రెడ్డి, మహేందర్ గౌడ్, వహీద్, యాదయ్య యాదవ్, అయ్యగళ్ళ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పసిపాప మృతికి కారకులైన వారిని శిక్షించాలి

దళిత సంఘాల డిమాండ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 25 : నాగర్ కర్నూలు జిల్లా కుమ్మర మల్లన్నజాతరలో కుల వివక్షతో రజక కుటుంబంపై దాడిలో పసిపాప మృతికి కారకులైన అగ్రవర్ణ రెడ్డిల పైన BNS 316, BNS316(3) జువెనైల్ జస్టిస్ యాక్టు 75 ప్రకారం కేసులు నమోదు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని పలు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు జిల్లా రజక సంఘం రాష్ట్ర నాయకులు ముత్యాల నరసింహులు. దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు సంజీవ్ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ్. మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు మురళి దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు రాష్ట్రంలో కుల వివేక్షత పెట్రేగిపోతుందని పసుపిల్లలను సైతం చంపడం దారుణమైన విషయమని వారు అన్నారు ఇలాంటి సంఘటనలు మళ్లీ కాకుండా చూడాలన్నారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నిరుపేదల సొంతింటి కల సాకారం

ప్రతిపక్షం, మిడిదొడ్డి, ఫిబ్రవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నిరుపేదల సొంతింటి కల సాకారమైందని ఆ పార్టీ దుబ్బాక నియోజకవర్గం బాధ్యుడు చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మిరుదొడ్డి మండల పరిధి లక్ష్మీ నగర్ లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ప్రోత్సాహకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ కలలుగన్న స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. శత శాతం పారదర్శకంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అవినీతి రహిత పాలనకు కాంగ్రెస్ ప్రభుత్వమే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వడ్డేపల్లి స్వప్న, ఏఎంసీ చైర్మన్ సంయుక్త, వైస్ చైర్మన్ భూపాల్ గౌడ్, మండలాధ్యక్షుడు రాజేశం, నాయకులు నర్ర రాజి




రెడ్డి, కనకా రెడ్డి, రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కట్టడాలను కాపాడుకుందాం..

పురాతన శివాలయ కోనేరు పునఃప్రక్షాలన కోసం నడుంబిగించిం న యువత

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 25 : దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దర్మాజీపేట గ్రామంలో ఉన్న దాదాపు 400 సం.ల చరిత్ర గల పురాతనమైన శివాలయంలోని కోనేరు శిథిలావస్థకు చేరడం తో, పురావస్తు కట్టడాలు కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో ఇట్టి కోనేరు పునఃప్రక్షాళన కోసం వేద సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ యువత ముందుకు రావడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ యువకులు, పెద్దలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని కోనేరు , ఆలయ పరిసర ప్రాంతాలు శుభ్రం చేయడం జరిగింది.ఈ సందర్భంగా వేద సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుతారి. సందీప్ మాట్లాడుతూ యువత ఇలాగే ముందుకు వచ్చి ప్రాచీన కట్టడాలను, మన సంస్కృతిని కాపాడుకుంటూ గ్రామ అభివృద్ధికి దోహదపడాలని తెలిపారు. ఇట్టి కోనేరు పునఃప్రక్షాళన కోసం సహాయ, సహకారాలు అందించిన వేద సేవా ఫౌండేషన్ వారికి గ్రామ పెద్దలు, యువకులు, శివాలయం కమిటీ సభ్యులు సన్మానించి ఇలాంటి సేవా కార్యక్రమాలు ముమ్ముందు మరెన్నో చేయాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విష్ణు వర్ధన్ రెడ్డి , మెరుపుల సాయి కుమార్ ,గ్రామ పండితులు విజయ లక్ష్మణ శర్మ, సందుగుల లక్ష్మణాచార్యులు(వేద పండితులు),శివాలయం అధ్యక్షులు, గ్రామస్తులు కారంపురి రవి ,నాగరాజు గౌడ్ ,లోకాని నర్సింలు,సుతారి కనుకయ్య , రామస్వామి,శంకర్,సాయి కృష్ణ, రాజశేఖర్, సాయితేజ,దివిటీ రాజు ,సురేష్, నరేష్, భాను, సందేశ్, రవితేజ,బాబు,రవి, బొల్లి సాయి, విజయ్, అరవింద్,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.





రాజమండ్రిలో కల్తీ పాల ఘటనపై అధ్యయనం చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా పాల కేంద్రాల్లో తనిఖీలు చేపడుతున్నాం. ప్రస్తుతం ఫుడ్ శాంపిల్స్ హైదరాబాద్ పంపిస్తున్నాం. త్వరలోనే విశాఖలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేస్తాం. శ్రీకాకుళంలో డయేరియా అదుపులోకి వచ్చింది. నీటి కలుషితం వల్లే డయేరియా ప్రబలింది.

- ఏపీ మంత్రి సత్యకుమార్

ప్రాంతీయం

సిద్ధిపేటలో బీఎంఎస్ భారీ ధర్నా



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 25: సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహించిన ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో కార్మికులు, బి ఎం ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎంఎస్ నేతలు మాట్లాడుతూ ఈపీఎఫ్95 కనీస పెన్షన్‌ను ప్రస్తుతం ఉన్న రూ.1000 నుండి రూ.7500కు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వేతనాలకు సంబంధించిన జీఓలను వెంటనే అమలు చేయాలని కోరారు. బీడీ కార్మికుల జీవన భృతి, మరణ భృతి రూపంలో ప్రకటించిన ఆర్థిక సాయాన్ని తక్షణమే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బీడీ కార్మికులకు 1000 బీడీలకు కనీసం రూ.500 కూలి ఇవ్వాలని పేర్కొన్నారు. స్కీమ్ వర్కర్స్ అయిన ఆశా, అంగన్‌వాడి, మిడ్‌డే మీల్స్, సీహెచ్ఓ, ఫార్మా ల్యాబ్స్ లిమిటెడ్ ఉద్యోగులు ధర్నాలో పాల్గొని తమ సమస్యలను వెల్లడించారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సామాజిక భద్రతతో పాటు గ్రాట్యుటీ, పెన్షన్ వంటి ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు .ఈ సందర్భంగా బిఎంఎస్ జాతీయ అధ్యక్షులు సుంకరి మల్లేశం మాట్లాడుతూ...గత ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. 2019లో కేంద్ర ప్రభుత్వం కార్మికుల పక్షాన చట్టపరమైన మార్పులు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఆ చట్టం ప్రకారం దేశవ్యాప్తంగా 44 కోట్లకు పైగా అసంఘటిత కార్మికులు లబ్ధి పొందే విధంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నిబంధనలు 2026 ఏప్రిల్ నుండి అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కార్మికులకు సామాజిక భద్రత విస్తరించేందుకు కృషి జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కార్మిక సంక్షేమం విషయంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కానీ రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయని ఆరోపించారు.ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని కార్మిక నాయకులు హెచ్చరించారు.కార్యక్రమంలో బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్, నాయకులు ముద్దం రాజిరెడ్డి, ఉమేష్, కొండల్ రెడ్డి రాజన్న (ఆర్టీసీ), పయ్యావుల భూపాల్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ పార్కింగ్‌లపై కఠిన చర్యలు

- ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్

ప్రతిపక్షం, గజ్వేల్ (ములుగు), ఫిబ్రవరి 25 : మార్కెట్ యార్డు కు వచ్చే భారీ వాహనాలు, లారీలు రాజీవ్ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలలోనే నిలపాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశించారు. బుధవారం నాడు ములుగు మండలం వంటిమామిడి మార్కెట్‌ను ఆకస్మికంగా సందర్శించిన అనంతరం మార్కెట్ పరిసరాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు, వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ పై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మార్కెట్ కమిటీ ప్రతినిధులు, వర్తకులు మరియు పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మార్కెట్ కు వచ్చే భారీ వాహనాలు, లారీలు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కింగ్ ప్రదేశాలలోనే నిలపాలని, ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రెవెన్యూ, మార్కెటింగ్ మరియు పోలీస్ శాఖలు ఒకరికొకరు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్ లోపల మరియు బయట క్రమశిక్షణ పాటించేలా వ్యాపారస్తులు పోలీసులకు సహకరించాలని అక్రమ పార్కింగ్ లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాన్య ప్రజలకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వాహనాల రాకపోకలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్థానిక పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో స్థానిక గజ్వేల్ ఏసీపీ నర్సింలు , గజ్వేల్ రూరల్ సీఐ రవి రాజు , స్థానిక ములుగు ఎస్ ఐ రఘుపతి , మార్కెట్ కమిటీ అధికారులు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హెల్త్ సెంటర్ ను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 25: రాజంపేట మండలంలో గల కొండాపూర్ గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కొండాపూర్ ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవల గురించి అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీల కు సంబంధించిన సేవలు చిన్నపిల్లలకు సంబంధించిన వ్యాధి నిరోధక టీకాల వివరాలు , ఇతర వైద్య సేవల గురించి తెలుసుకోవడం జరిగింది ఆరోగ్య కేంద్రం లో గల హాజరు పట్టికను , అవుట్ పేషెంట్ రిజిస్టర్ వివరాలను , మందులు ఔషధాల యొక్క నిలువ రిజిస్టర్ , మందుల పంపిణీ వివరాలను గురించి ఆరోగ్య కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ పర్యవేక్షణ సమయంలో ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ప్రజలను ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ సిబ్బందికి కావలసినటువంటి సదుపాయాల గురించి కలెక్టర్ ఆరా తీయగా సిబ్బందికి కావలసినటువంటి మూత్రశాలలు మరుగుదొడ్ల విషయంలో ఇబ్బంది ఉన్నందున వెంటనే తగిన చర్యలు చేపట్టాలని స్థానిక గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించారు. కొండాపూర్ గ్రామంలో గల ప్రజలకు వివిధ వైద్య సేవల కోసం ఎర్రపహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళవలసి వస్తుంది అట్టి సేవలు అన్నిటిని రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందేలా చూడాలని అక్కడి ప్రజలు విజ్ఞప్తి చేయగా కలెక్టర్ వెంటనే స్పందించి అన్ని రకాల వైద్య సదుపాయాలు ఆరోగ్య సేవలు రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందేలా తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారి డా,, రవీందర్ గౌడ్ ,జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామిరెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఖాసీం ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ఎస్ రీజినల్ సెంటర్

అసిస్టెంట్ డైరెక్టర్ సైదియా నాయక్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 25 : జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యకర్తలు సామాజిక సైనికులుగా భావించి సమాజ సేవకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ రీజినల్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ సైదియా నాయక్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్ క్లీనింగ్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నివారణ లక్ష్యంతో చేపట్టిన శుభ్రత కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడారు.ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజంలో సేవాభావంతో పనిచేస్తూ ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వాలంటీర్లు సామాజిక సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.అనంతరం ఎన్ఎస్ఎస్ స్టేట్ ఆఫీసర్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. వాలంటీర్లు సంకల్పిస్తే సమాజంలో విశేషమైన మార్పులు తీసుకురాగలరని,అందుకోసం ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు రావాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగి సమాజ సేవలో పాల్గొనడం ద్వారా బాధ్యతగల పౌరులుగా ఎదగవచ్చన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.హుస్సేన్ మాట్లాడుతూ..భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, రీజినల్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్, స్టేట్ ఆఫీసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లుకు, పాల్గొన్న వాలంటీర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెదక్,నర్సాపూర్ ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, టిటిడబ్ల్యూఆర్ డిగ్రీ కళాశాల మెదక్, ఎల్లంకి డిగ్రీ కళాశాల నర్సాపూర్ తదితర కళాశాలల నుండి మొత్తం 314 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని స్థానిక రైల్వే స్టేషన్, స్టేడియం, కొత్త బస్టాండ్ ఆవరణ, తారకరామా నగర్ హౌసింగ్ బోర్డ్ ప్రాంతం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతాలలో శుభ్రత కార్యక్రమం చేపట్టి దాదాపు 20కి పైగా ప్లాస్టిక్ సంచులను సేకరించి మున్సిపాలిటీ అధికారులకు అప్పగించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీలత, మురళి, శరద్దీపిక, సువర్ణ, శ్రీనివాస్, భూమేష్, కృష్ణ మరియు ఇతర వాలంటీర్లు పాల్గొన్నారు.



ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- మెదక్ అదనపు ఎస్పీ ఎస్.మహేందర్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 25 : జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ. మహేందర్ మెదక్ జిల్లా కేంద్రంలో పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు, మెడికల్ ఎమర్జెన్సీ టీమ్‌లు, విద్యార్థులకు కల్పించిన కనీస వసతులు తదితర అంశాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎవ్వరూ గుంపులుగా తిరగడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడుతున్నందున, పరీక్ష కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని ఆదేశించారు.విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలని, తల్లిదండ్రులు మరియు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న

శ్యామలకు రూ.20 వేల ఆర్థిక సాయం

- ఆపన్నహస్త మిత్ర బృందం 120వ సేవా కార్యక్రమం
- మందుల ఖర్చుల కోసం నగదు అందజేత

- దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి



ప్రతి పక్షం, దౌల్తాబాద్, ఫిబ్రవరి 25 : గజ్వేల్ పట్టణం ఆపన్న హస్త మిత్ర బృందం కార్యాలయం వద్ద బృందం 120వ సేవా కార్యక్రమం నిర్వహించారు. కిడ్నీ వ్యాధితో తీవ్రంగా బాధపడుతున్న మహిళకు మందుల ఖర్చుల కోసం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన చుంచనకోట శ్యామల (40)కు పదేళ్ల క్రితం రెండు కిడ్నీలు పనిచేయకుండా పోయాయి. ఆమె భర్త ఎల్లాగౌడ్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ చికిత్స చేయించారు. రెండేళ్లకు పైగా దయాలసిస్ చేయించగా, కుటుంబంపై భారీ భారం పడింది. 2020లో శ్యామల తల్లి నర్సమ్మ కిడ్నీ దానం చేయడంతో మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. ఇందుకోసం కుటుంబానికి ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో ఎకరన్నర అమ్మకానికి పెట్టి చికిత్స ఖర్చులు తీర్చారు. ప్రస్తుతం శ్యామల ఒకే కిడ్నీతో జీవనం సాగిస్తోంది. ప్రతినెలా మందుల కోసం సుమారు రూ.30 వేల వరకు ఖర్చవుతుండటంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది అన్ని తెలిపారు. ఇటీవల మందులు సమయానికి అందక ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మళ్లీ ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. మిగిలిన అర ఎకరం భూమి చెరువు నీటిలో మునిగిపోతుండటంతో విక్రయించలేని పరిస్థితి నెలకొంది. గ్రామంలోని పెంకుటిల్లు దెబ్బతినడంతో ప్రస్తుతం అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. వారి దయనీయ పరిస్థితి తెలుసుకున్న ఆపన్న హస్త మిత్ర బృందం అధ్యక్షుడు పాశికంటి బాలచంద్రం ఆధ్వర్యంలో రూ.20 వేల నగదు అందజేశారు. మరెవరైనా సహాయం చేయాలనుకుంటే 9346255858, 6300077903 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పాశికంటి బాలచంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి కొల్లూరి శ్యాం ప్రసాద్, ఉపాధ్యక్షుడు కొలిచెల్మే స్వామి, సభ్యులు రాణి, రాజు, మహేష్, శ్రీకాంత్, రాంరెడ్డి, విజయ్, బిక్షపతి, ధనరాజ్, కరుణాకర్, వెంకటేష్, మంగలి సాయి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిడ్డకు మద్దతు ఇచ్చాడే గాని

పూటకో పార్టీ మారలేదు

గజ్వేల్ బిజెపి నాయకులు

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 25 : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు పరస్పర అవగాహనతో నిర్ణయాలు తీసుకున్నాయని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పార్టీ ఉన్నత నాయకత్వం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు బిఆర్ఎస్‌కు చెందిన బీసీ వర్గ అభ్యర్థికి మద్దతు ఇచ్చారని వారు తెలిపారు.

ఈ నేపథ్యంలో ఎంపీపై అనవసర ఆరోపణలు చేయడం తగదని, రాజకీయ అవకాశవాదంతో విమర్శలు చేయడం సమంజసం కాదని వారు అన్నారు. గతంలో వివిధ పార్టీలలో పదవులు అనుభవించి, పరిస్థితులు మారినప్పుడు పార్టీలు మారిన నాయకులు ఇప్పుడు బీసీల పేరుతో రాజకీయ లాభం పొందేందుకు ప్రయత్నించడం సరికాదని విమర్శించారు. ఎంపీ రఘునందన్ రావు నిజాయితీ గల నాయకుడని, అధికార పార్టీ వైపు వెళ్లకుండా ప్రజల్లోనే ఉంటూ ఎమ్మెల్యేగా, అనంతరం ఎంపీగా గెలిచి తన నిబద్ధతను నిరూపించుకున్నారని పేర్కొన్నారు. బీసీలకు, ముఖ్యంగా ముదిరాజ్ వర్గానికి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో పార్టీ పదవుల్లో ముదిరాజ్ వర్గానికి అవకాశాలు కల్పించారని, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డులలో ఆరుగురు ముదిరాజ్ అభ్యర్థులకు బీఫారాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. బీసీ వర్గాల పేరుతో విభజన సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. ముదిరాజ్ సమాజాన్ని స్వార్థ రాజకీయాల కోసం ఉపయోగించొద్దని సూచించారు. ఎంపీపై అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ నాలుగో వార్డ్ కౌన్సిలర్ రొట్టెల శ్రీను ముదిరాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ సీనియర్ నాయకులు మామిండ్ల నాగు ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ రొట్టెల దాస్ ముదిరాజ్, కదుల ఎల్ల ముదిరాజ్, కాల సాయి ముదిరాజ్, శ్రీరామ్ కృష్ణ ముదిరాజ్, చిక్కుడు ప్రసాద్ ముదిరాజ్, దేవేందర్ ముదిరాజ్, రాజు ముదిరాజ్, మధు ముదిరాజ్, టోనీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కందకుర్తి పుష్కర ఘాట్ ను సందర్శించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 25 : రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. వచ్చే ఏడాది 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని ప్రధానమైన ఈ పుష్కర ఘాట్ ను క్షేత్రస్థాయిలో సందర్శించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పుష్కర ఘాట్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కరాల సమయంలోనే కాకుండా ఈ ప్రదేశానికి సాధారణ సమయాలలోనూ భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు కనీస సదుపాయాలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గోదావరి పుష్కరాలకు ఈ ఘాట్ వద్ద వీ.వీ.ఐ.పీలు, లక్షలాదిగా భక్తులు పుణ్యస్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు వంటివి పక్కాగా అందుబాటులో ఉండాలన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామారావు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

ప్రత్యేక తరగతులను తనిఖీ ఎంఈవో



ప్రతిపక్షం, దౌల్తాబాద్, ఫిబ్రవరి 25 : మండల పరిధిలోని ,జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత,పాఠశాల దౌల్తాబాద్ పాఠశాలల్లో పదవ తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణను మండల విద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ,ప్రత్యేక తరగతి గణిత శాస్త్రం సంబంధించి నిర్వహణ పరిశీలించి, విద్యార్థులకు తగు సూచనలు చేయడం జరిగింది. పరీక్షల సమయం దగ్గర, పడుతున్నందున విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా, సద్వినియోగం చేసుకోవాలని ప్రతి గణిత సమస్యను పునరావృతం చేస్తూ సందేహాలను ఉపాధ్యాయుల సలహాలతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. మండలంలోని పదవ తరగతి ఫలితాల్లో ఎక్కువమంది విద్యార్థులు 10 జీపీఏ సాధించి మండలానికి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ శేషయ్య గణిత శాస్త్ర ఉపాధ్యాయులు కృష్ణ మహేశ్వరి పాల్గొన్నారు.



లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌ను కలిసి తాను పెద్ద తప్పు చేశాను. దాని వల్ల ఇబ్బంది పడ్డ వారికి, గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెబుతున్నా. రష్యన్ అమ్మాయిలతో అఫైర్ ఉందనే విషయాన్ని ఎప్‌స్టీన్ తెలుసుకున్న మాట నిజమే. కానీ ఎప్‌స్టీన్ బాధితులతో నాకు ఎలాంటి సంబంధం లేదు. తాను చట్టవిరుద్ధమైన పనులు చేయలేదు.

- బిల్ గేట్స్



విజ్ఞానాన్ని ప్రత్యక్షంగా చూపించే వేదికే 'సైన్స్ ఎక్స్‌పో'

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 25 : పుస్తకాల్లో నేర్చుకున్న విజ్ఞానాన్ని విద్యార్థులు ఆచరణలో చూపించే అద్భుత వేదికే వైజ్ఞానిక ప్రదర్శన అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ అన్నారు. బుధవారం నాడు గజ్వేల్ పట్టణంలోని సాయి జీడిఆర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉడాన్2కె26 వైజ్ఞానిక ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను, ఆలోచనా శక్తిని,పరిశోధన సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి ఇలాంటి ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు సైన్స్ పై ఆసక్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి అవకాశం ఉంటుందన్నారు. సమాజానికి ప్రయోజనం చేకూర్చాలనే కొత్త ఆలోచనలు పెరగడం ద్వారా సమాజ అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. ఇది కేవలం ప్రదర్శన మాత్రమే కాదు, విద్యార్థుల భవిష్యత్తు ఆవిష్కరణలకు మొదటి అడుగు అని విరాహత్ అలీ పేర్కొన్నారు. సైన్స్ అనేది ఎక్కడో లేదని, అది మన దైనందిన జీవితంలో ప్రతి క్షణం భాగమై ఉంటుందని ఆయన స్పష్టం చేసారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను బయటకు తీస్తున్న సాయి జీడీఆర్ పాఠశాల యాజమాన్యాన్ని విరహత్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టి. సోమేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులు సన్నద్ధం కావాలి

- వంద శాతం ఫలితాలు సాధించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- కాజీపేట మండలం రాంపూర్ లోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 25: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధమై మంచి ఫలితాలు సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపూర్ లోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఏడు, పదో తరగతులను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులను పాఠ్యాంశాలకు సంబంధించిన పలు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో బోర్డుపై పాఠ్యాంశానికి సంబంధించిన వివరాలను రాయించారు. ఇంగ్లీషులో రాయడం, చదవడం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షల సమీపిస్తున్నాయని, విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు సంబంధించి పూర్తిస్థాయిలో సన్నద్ధత కావాలని అన్నారు. వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు బాగా చదవాలన్నారు. విద్యార్థులను చదువుల్లో మరింత ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా పాఠశాలకు సంబంధించి కిచెన్ షెడ్డును పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ఏం వండుతున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యార్థులకు వంట చేశారని అడిగారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, తహసిల్దార్ రాజు, ఎంఈవో మనోజ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ కడియం కావ్యకు అరుదైన గౌరవం

- ఇండియా–సౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యురాలిగా ఎంపిక

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 25: వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యకు అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల ఏర్పాటు చేసిన ఇండియా-సౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యురాలిగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యని లోక్‌సభ స్పీకర్ నామినేట్ చేశారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ (కాన్ఫరెన్స్ అండ్ ప్రోటోకాల్ బ్రాంచ్) అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. భారతదేశం - సౌదీ అరేబియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడమే లక్ష్యంగా ఈ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఈ బాధ్యత తనకు అప్పగించినందుకు లోక్‌సభ స్పీకర్ గారికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు. భారత్-సౌదీ అరేబియా మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పార్లమెంటరీ స్థాయిలో తన వంతు కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 25 : జిల్లాలో నేటి నుండి ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రశ్నాపత్రాల భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విద్యార్థుల హాజరు శాతం,హాల్ టికెట్ల తనిఖీ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, మాల్ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు తీసుకురాకుండా చూడాలని, సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ అధికారి , తహసిల్దార్ హిమబిందు, ప్రిన్సిపల్, తదితరులు ఉన్నారు.

గీతంలో వందేమాతరం 150వ వార్షికోత్సవం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 25 : హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని స్ఫూర్తిదాయకంగా జరుపుకున్నారు. వందేమాతరం పూర్తి గీతాన్ని సామూహికంగా పాడారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రేరేపించిన, జాతీయ ఐక్యత, మాతృభూమి పట్ల భక్తికి ప్రతీకగా నిలిచిన జనాదరణ పొందిన కూర్పుకు ఈ కార్యక్రమం ద్వారా నివాళులర్పించారు. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన దేశవ్యాప్త ఉత్సవాలలో భాగంగా ఈ వేడుకలను నవంబర్ 2025 నుంచి నవంబర్ 2026 వరకు ఏడాది పొడవునా జాతీయ గీతం స్మారకోత్సవం నిర్వహిస్తున్న విషయం విదితమే. భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వం, దేశభక్తి పట్ల తమ గౌరవాన్ని పునరుద్ఘాటిస్తూ గీతం అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



అంతర్జాతీయ సదస్సులో

గీతం అధ్యాపకుడికి ఉత్తమ పత్ర అవార్డు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 25 : గీతం అధ్యాపకుల కృషి మరోసారి విద్యారంగ నిపుణుల ప్రశంసలను అందుకుంది. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ లో అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. శ్రీధర్ ఫైనాన్స్ ట్రాక్ లో మొదటి స్థానం పొంది, ఉత్తమ పత్ర అవార్డును గెలుచుకున్నారు. బెంగళూరులోని క్రైస్ట్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన వ్యాపార ఆవిష్కరణ, పరివర్తనపై అంతర్జాతీయ సమావేశం (ICFBIT 2026)లో ఆయన ఈ ప్రశంసలందుకున్నారు. స్థిరమైన పరివర్తన, ఆర్థిక మార్కెట్లు: పర్యావరణ హిత సాంకేతిక సంస్థలలో ఐబీసీ పాత్ర' అనే శీర్షికన డాక్టర్ శ్రీధర్ సమర్పించిన పరిశోధనా పత్రం సమీక్ష మండలి మన్ననలను చూరగొంది. ఇది ఎంతో వాస్తవికంగా, లోతైన పరిశోధనతో, చక్కని భావ ప్రకటనలో ఎంతో స్పష్టంగా ఉందని ప్రశంసించింది. సదస్సు నిర్వాహక కమిటీ కూడా ఈ పత్రం విద్యాపరంగా అభిప్రాయాలను సూటిగా వెల్లడించిందని, సమావేశ ఇతివృత్తానికి సంబంధించిన ఔచిత్యానికి అనుగుణంగా ఉందని పేర్కొంది. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తాతో సహా గీతం నాయకత్వం ఈ విజయాన్ని సాధించిన డాక్టర్ శ్రీధర్ ను అభినందించింది. ఇదే స్ఫూర్తిని ఇక ముందు కూడా కొనసాగించమని ఆయనను ప్రోత్సహించింది.



దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- డీజీపీకి బీజేపీ నాయకుల వినతి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 25 : జిల్లాలో అమాయక హిందువులపై దాడి చేసిన ముష్కరుల ను కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు హైదరాబాద్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చంద్రరావుతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని రుద్రూర్, బాన్సువాడ నిజామాబాద్లో హిందువులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి కోరారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ హిందువులపై కొందరు దుండగులు ఉద్దేశపూర్వకంగా దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. స్థానిక పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. బాధితులు స్థానిక పోలీసు అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ కనీస స్పందన లేదని పక్షపాత ధోరణితో బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇకనైనా నిందితులను అరెస్టు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడులు జరుగుతున్న సున్నితమైన ప్రాంతాల్లో తక్షణమే పోలీసు బలగాలని మోహరించి భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హిందువులకు భద్రత కల్పించాలన్నారు.



పర్యాటక ప్రాంతంగా తీగలనాగారం చెరువు

- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఒక కోటి 30 లక్షల రూపాయలతో చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 25 : బీరంగూడ డివిజన్ పటేల్ గూడ పరిధిలోని తీగలనాగరం చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. చెరువు పరిధిలో ఒక కోటి 35 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఫెన్సింగ్ నిర్మాణ పనులకు బుధవారం ఉదయం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటేల్ గూడ పరిధిలోని వివిధ కాలనీల ప్రజల సౌకర్యార్థం చెరువు అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే బండ్ పనులు పూర్తి కావడం జరిగిందని తెలిపారు. చెరువు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ వేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని చెరువుల సంరక్షణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, హెచ్ఎండబ్ల్యూఎస్ ఇరిగేషన్ ఈఈ మల్లేష్, డిఈ రాజశేఖర్, ఏఈ గులాం, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చెవి నొప్పితో వస్తే ప్రాణం తీశారు

- మృత దేహంతో కుటుంబ సభ్యుల ధర్నా




ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 25 : చెవి నొప్పితో వచ్చిన ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున జిల్లా కేంద్రం లో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఖలీల్ వాడిలో ద్వారక ఆస్పత్రి లో భీంగల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన గంగం అజయ్ కి చెవి నొప్పి రావటం తో గత మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చికిత్స తీసుకువచ్చారు. అజయ్ ను పరీక్షించిన చెవి వైద్య నిపుణులు ఆపరేషన్ చేయాలని సూచించాడు.ఆపరేషన్ కోసం అన్ని సిద్ధం చేసుకుని మత్తు వైద్యున్ని పిలిపించి మత్తు ఇంజక్షన్ చేసి ఆపరేషన్ ప్రారంభించారు. రెండు మూడు గంటలైనా ఆసుపత్రి వైద్యులు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు వైద్యులను అడుగగా దాటవేస్తూ నిర్లక్ష్యపు సమాధానాలు ఇచ్చారని వాపోయారు. ఏదైనా ఉంటే చెప్పండి అడిగితే పేషెంట్ పరిస్థితి సీరియస్ గా ఉందని ఆసుపత్రి వైద్యులు సమాధానం ఇవ్వటంతో కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. అజయ్ ని హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్తామని కుటుంబ సభ్యులు తెలుపగా వైద్యుడి సూచనల మేరకు నగరంలోని హోప్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం ఉదయం అజయ్ ను పరిశీలించిన వైద్యులు అజయ్ మృతి చెందినట్లు తెలుపడంతో కుటుంబ సభ్యులు గుండెలు బాగున్నారు. అనంతరం మృతదేహాన్ని తీసుకొని వచ్చి ద్వారక ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు మృత దేహంతో ధర్నాకు దిగారు. మత్తు వైద్యులు ఇచ్చిన ఇంజక్షన్ తోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆస్పత్రిలో వెంటిలేటర్ సౌకర్యాలు లేవని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని హాస్పిటల్ ఎదుట ఆందోళన కు దిగారు. విషయం తెలుసుకున్న ఒకటవ టౌన్ పోలీసులు ఆసుపత్రికి చేరుకొని బందోబస్తు నిర్వహించారు. యువకుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు ధర్నాకు దిగారు.

బడ్జెట్లో వికలాంగుల సంక్షేమానికి 5 శాతం నిధులివ్వాలి

- వికలాంగుల పెన్షన్ 6000 లకు పెంచాలి
- వీబీజీ రామ్ జీ 2025 బిల్లు రద్దు చేయాలి
- ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే పరికరాలు పంపిణీ చేయాలి ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 25 : కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో వికలాంగుల సంక్షేమనికి 5 శాతం నిధులు కేటాయించాలని, పెన్షన్ 6000 లకు పెంచి వెంటనే అమలు చేయాలని ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య డిమాండ్ చేశారు. ఎన్ పి ఆర్ డి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అడిషనల్ కలెక్టర్ పాండు గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ధర్నాను ఉద్దేశించి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వికలాంగుల సంక్షేమనికి 1669. 72 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు.నిధుల కేటాయింపులో కేంద్రం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు.202627 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టె బడ్జెట్లో వికలాంగుల సంక్షేమనికి నిధుల కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు.రాష్ట్రప్రభుత్వం మర్చి 20 నాడు ప్రవేశపెట్టే బడ్జెట్లో వికలాంగుల సంక్షేమనికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాల నుండి ప్రభుత్వం కేటాయించిన నిధులు విడుదల చేసి ఖర్చు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ఉందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్బంగా ఇచ్చిన హామీల అమలు కోసం నిధులు ఎందుకు పెంచడం లేదని అన్నారు. చేయూత పెన్షన్స్ పెంపు కోసం బడ్జెట్లో నిధులు కేటాయించి, పెన్షన్స్ పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 26 నెలలు పూర్తివుతున్న పెన్షన్స్ పెంచడం లేదని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు సహాయ పరికరాల పంపిణి కోసం లబ్ధిదారుల జాబితాలు తయారు అయ్యాయని ఎందుకు పరికరాలు పంపిణి చేయడం లేదని అన్నారు. 202425 ఆర్థిక సంవత్సరనికి చెందిన పరికరాలు పూర్తిస్థాయిలో పంపిణి చేయకుండానే 202526 ఆర్థిక సంవత్సరనికి దరఖాస్తులు స్వీకరించడం సరైంది కాదని అన్నారు.ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను గుర్తించి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.విబి జిరామ్జి బిల్లు రద్దు చేసి నరేగా చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వికలాంగులపై దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు పెరిగిపోతున్నాయని అన్నారు. వాటినీ అరికట్టెందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం బస్వరాజుపాటిల్ , కొనింటి నర్సిములు మాట్లాడుతూ జిల్లాలో పరికరాలు పంపిణి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. పెన్షన్స్ పంపిణి చేయడంలో జిల్లాలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.కొత్త పెన్షన్స్ కోసం దరఖాస్తూ చేసిన వారికి ఎందుకు మంజూరు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వ కార్యాలయలలో ర్యాంపులు లేకపోవడం వలన వికలాంగులు ఇబ్బంది పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. జిల్లాలో ఉన్నా ప్రయివేట్ పరిశ్రమాల్లో నిరుద్యోగ వికలాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.సదరం క్యాంపు నిర్వహణలో వస్తున్న సమస్యలను ఎందుకు పరిష్కారం చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అంపర్డ్ ఎన్ పి ఆర్ డి రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, పి మేరీ, జిల్లా ఉపాధ్యక్షులు లలిత, రాంచందర్, వెంకన్న, రాములు,రాజ్ కుమార్,సహాయ కార్యదర్శులు కృపవరం,కుమ్మరి నర్సిములు, నవీన్ చారి, శంకర్ నాయక్,జిల్లా నాయకులు అంజమ్మ, పవన్, మల్లమ్మ, జయమ్మ, జలందర్ తదితరులు పాల్గొన్నారు.



వీఎస్ఆర్ ఏవియేషన్స్‌తో హెరిటేజ్‌కు ఎలాంటి లావాదేవీలు లేవు. 2022లో హెరిటేజ్ ఫిన్‌లీజ్‌లో వీఎస్ఆర్‌సంస్థ ఫైనాన్స్ తీసుకుంది. ఆ రోజు మేము అధికారంలోకి వస్తామని, మా ఎంపీ ఏవియేషన్ మంత్రి అవుతారని, అజిత్ పవార్ వీఎస్ఆర్‌హెలికాప్టర్‌లో ఎక్కుతారని కలగన్నామా? బాబాయ్‌ని హత్య చేసి మా చేతిలో కత్తి పెట్టారు. వీఎస్ ఆర్ ఏవియేషన్‌పై వైసీపీ ఆరోపణలూ అలాంటివే.

- ఏపీ మంత్రి నారా లోకేశ్





విశ్వ వీక్షణం

మోడీ నా సవాల్ స్వీకచరించలేదు

- సైలెంట్ గా ఇజ్రాయెల్ వెళ్లిపోయారు: రాహుల్ గాంధీ


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, భోపాల్, ఫిబ్రవరి 25: భారత్‌అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని తాను సవాల్ విసిరి 24 గంటలు దాటినా మోదీ స్పందించలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తన సవాల్ స్వీకరించలేక, మోదీ మరోసారి సైలెంట్ గా ఇజ్రాయెల్ వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. "గతంలో ఒకసారి ఎప్‌స్టీన్ ఆదేశాల మేరకు మీరు ఇజ్రాయెల్‌లో ఆటపాటలతో గడిపారు. మరి ఈసారి ఎవరి ఆదేశాల మేరకు దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఒప్పందం కుదుర్చుకొని వస్తారు?" అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. మంగళవారం భోపాల్‌లో జరిగిన కిసాన్ మహాచౌపాల్ ర్యాలీ ప్రసంగించిన రాహుల్, 'భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం తీవ్ర ఒత్తిడి మధ్య జరిగిందని ఆరోపించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తరువాత ఆ రైతు వ్యతిరేక ఒప్పందాన్ని రద్దు చేసే ధైర్యం ప్రధాని మోదీకి ఉందా?' అని సవాల్ విసిరారు. ఈ ఒప్పందం రైతుల గుండెల్లో గుచ్చిన బాణంగా రాహుల్ అభివర్ణించారు. ట్రంప్ తన రెండో విడత పదవీకాలంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించిన ఆర్థిక ఎజెండాకు అమెరికా సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చట్టవిరుద్ధమని, ఆయన తన పరిధిని దాటి ఈ నిర్ణయం తీసుకున్నారని సుప్రీంకోర్టు 63 మెజారిటీతో తీర్పునిచ్చింది. కాంగ్రెస్ పార్టీ కూడా ప్రధాని మోదీని ఎప్‌స్టీన్ కేసుతో ముడిపెడుతూ తీవ్ర ఆరోపణలు చేసింది. 2014 తర్వాత భారత్‌ఇజ్రాయెల్ సంబంధాల రూపకల్పనలో ఎప్‌స్టీన్ కీలక పాత్ర పోషించాడని పేర్కొంది. "ఇజ్రాయెల్‌పాలస్తీనా విషయంలో భారత్ విదేశీ విధానం ఎప్పుడూ ద్విదేశ సిద్ధాంతంపైనే ఆధారపడి ఉండేది. అయితే 'అమెరికాఇజ్రాయెల్ లాబీ' దశాబ్దాల నాటి మన విదేశాంగ విధానాన్ని పూర్తిగా మార్చేసింది. సామాన్య ప్రజలకు జెఫ్రీ ఎప్‌స్టీన్ ఒక ఘోరమైన లైంగిక నేరగాడు కావచ్చు. కానీ మోదీ ప్రభుత్వ విదేశీ విధానానికి అతడొక హీరో. చనిపోయిన తరువాత కూడా ఎప్‌స్టీన్ మోదీ ప్రభుత్వ నిర్ణయాల్లో, విధానాల్లో జీవించి ఉన్నాడు" అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ఆరోపించారు.





కాల్షియం మాత్రలు వేసుకుంటే
కిడ్నీలో రాళ్లు వస్తాయా?

కాల్షియం సప్లిమెంట్స్‌తో కిడ్నీల్లో రాళ్లు వస్తాయా అనే సందేహం అనేక మందికి కలుగుతుంటుంది. కొందరు వైద్యుల్ని సంప్రదిస్తే మరికొందరు తీవ్ర భయానికి లోనై కనీసం పాలు, పెరుగు తీసుకోవడం కూడా మానేస్తుంటారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించి అనేక పోస్టులు చూసి తీవ్రంగా ప్రభావితమవుతుంటారు జనాలు. అయితే, ఈ విషయంలో అనవసర ఆందోళన అవసరం లేదు. కేవలం కాల్షియం సప్లిమెంట్స్‌తో కిడ్నీల్లో రాళ్లు రావు. సాధారణంగా శరీరానికి తగినంత కాల్షియం అందని సందర్భాల్లో ఎముకల్లోని కాల్షియంపై ఆధార పడాల్సి వస్తుంది. దీంతో, రక్తంలో కాల్షియం స్థాయిల నిర్వహణ కోసం ఎముకల్లోని కాల్షియం క్రమంగా కరిగిపోతుంది. మూత్రం ద్వారా ఈ కాల్షియం విసర్జితమవుతుంది. కొన్ని సందర్భాల్లో కాల్షియం గడ్డకట్టి రాళ్లలా మారుతుంది. ముఖ్యంగా భారతీయుల్లో కిడ్నీ రాళ్ల వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది. మొత్తం జనాభాలో దాదాపు 12 శాతం మంది ఈ సమస్యతో సతమతమవుతున్నారు. కొందరికి జన్యు కారణాల రీత్యా ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. ఇతరత్రా కారణాలు కూడా కిడ్నీల్లో రాళ్లు ఏర్పడేలా చేస్తున్నాయి. ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తినడం, పానీయాలు తక్కువగా తీసుకోవడం, ఆహారంలో ఆక్సాలేట్స్, యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉండటం వంటివన్నీ కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే ముప్పును పెంచుతున్నాయి. కిడ్నీల్లో ఏర్పడే రాళ్లల్లో అధిక శాతం కాల్షియం ఆధారితైనవే. అంటే.. ఇవి కాల్షియం ఆక్సాలేట్, కాల్షియం ఫాస్ఫేట్, యూరిక్ యాసిడ్‌తో పాటు ఇతర రసాయనాలతో ఏర్పడతాయి. దీంతో, కాల్షియం తీసుకోవడాన్ని తగ్గిస్తే ఈ ముప్పు తప్పుతుందని కొందరు భావిస్తుంటారు. అయితే, ఆహారంలో కాల్షియం ఎక్కువగా ఉంటే కిడ్నీల్లో రాళ్లు వచ్చే అవకాశం తగ్గుతున్న విషయాన్ని ఇప్పటికే కొన్ని అధ్యయనాల్లో రుజువైంది. ఆహారంలో ఉన్న కాల్షియం, పేగుల్లోని ఆక్సాలేట్ తో బలంగా అనుసంధానం అవుతుంది. ఫలితంగా ఆక్సాలేట్‌ను శరీరం గ్రహించలేదు. దీంతో, శరీరంలో ఈ రసాయనం స్థాయిలు తగ్గి కిడ్నీల్లో రాళ్ల సమస్య ప్రమాదం కూడా తగ్గుతుంది.



కిడ్నీలో రాళ్లు అంటే ఏమిటి? అవి ఎలా ఏర్పడుతాయి..

మూత్ర పిండాలలో ఏర్పడిన రాళ్ళని వైద్య పరి భాషలో మూత్రపిండ కాలిక్యులి, నెఫ్రోలిథియాసిస్ లేదా యురోలిథియాసిస్ అని కూడా అంటారు. భారతదేశంలో మూత్రపిండాల్లో రాళ్ల ప్రాబల్యం సుమారు 12 శాతం ఉండవచ్చు అని గణాంకాలు చెప్తున్నాయి. ఉత్తర భారత దేశం లో మాత్రం మూత్రపిండాల రాళ్ల ప్రాబల్యం 15 శాతం ఉండవచ్చు అని అధ్యయనాలు వల్ల తెలుస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు కలిగి ఉన్న రోగులలో చాల మట్టుకు కాల్షియమ్ రాళ్లు ఏర్పడతాయి (75%-85%). ఇతర రకాల రాళ్లు, యూరిక్ ఆసిడ్ రాళ్లు (8%-10%), స్ట్రువైట్ లేదా అమ్మోనియం రాళ్ళు (7%-8%), సిస్టీన్ రాళ్ళు (7%-8%) శరీరంలోని కాల్షియం, ఆక్సలేట్ – యూరిక్ యాసిడ్ పెద్ద మొత్తంలో కలిసిపోయి మూత్రపిండాలలో పేరుకుపోవడం ప్రారంభించినప్పుడు రాళ్ళు ఏర్పడతాయి. తక్కువ నీరు వినియోగించినప్పుడు, పేరుకుపోయిన కాల్షియం, ఆక్సలేట్ – యూరిక్ యాసిడ్ మూత్రం ద్వారా బయటకు రాలేనప్పుడు ఇది జరుగుతుంది.. తరువాత అవి క్రమంగా ఘనీభవించి రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి. మీరు ఆహారం నుండి కాల్షియం తీసుకుంటే, సప్లిమెంట్లతో పోలిస్తే రాళ్ళు ఏర్పడే ప్రమాదం తక్కువగా ఉంటుంది. పాలు, పెరుగు, జున్ను, ఆకుకూరలు, బాదం కాల్షియం మంచి వనరులు. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలను అందించడమే కాకుండా శరీరం వాటిని సులభంగా జీర్ణం చేసుకోగలదు..

ఎవరు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి?

ఇప్పటికే కిడ్నీలో రాళ్ల సమస్య ఉన్నవారు.వారి కుటుంబంలో రాళ్ల చరిత్ర ఉన్నవారు.యూరిక్ యాసిడ్ సమస్య ఉన్నవారు. అలాంటి వారు మి వ్యక్తి గత వైద్యుడిని సంప్రదించకుండా కాల్షియం సప్లిమెంట్లను తీసుకోకూడదు.

గుర్తు ఉంచుకోవాల్సింది

అయితే, ఆహారంతో నిమత్తం లేకుండా కాల్షియం తీసుకుంటే మాత్రం శరీరం రెండిటినీ గ్రహిస్తుంది. మూత్రంలో వీటి శాతం పెరుగుతుంది. అంతిమంగా ఇవి కిడ్నీల్లో కాల్షియం ఆక్సాలేట్ రాళ్లుగా మారి సమస్యలకు దారి తీస్తాయి. కాబట్టి కాల్షియం సప్లిమెంట్స్‌ను ఆహారంతో పాటు తీసుకోవాలి. అయితే, కిడ్నీల్లో రాళ్లకు ప్రధాన కారణం డీహైడ్రేషన్ శరీరంలో తగినంత నీరు లేనప్పుడు కిడ్నీల్లోని కాల్షియం, ఇతర ఖనిజాలు గడ్డకట్టి రాళ్లగా మారే అవకాశం పెరుగుతుంది . కాబట్టి రోజుకు కనీసం 3 లీటర్ల నీరు తాగాలి.

చాలా మంది అడుగుతున్న ప్రశ్న

బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు కరిగిపోతాయా..?
బీరు తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు కరిగిపోవు. ఈ అపోహకు శాస్త్రీయ ఆధారాలు లేవు. వాస్తవానికి, బీరు తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. ఎందుకంటే బీరులో డీహైడ్రేషన్ కలిగించే ఆల్కహాల్ ఉంటుంది. డీహైడ్రేషన్ వల్ల మూత్రం సాంద్రత పెరిగి, రాళ్లు ఏర్పడే అవకాశం పెరుగుతుంది. బీరులో అక్సలేట్లు, ప్యూరిన్ లు అధికంగా ఉండుట వలన కిడ్నీలో రాళ్ళు ఏర్పడవచ్చు...

ఇతర కారణాలు, జాగ్రత్తలు

కిడ్నీ రాళ్లకు కారణాలు కిడ్నీ రాళ్లు ఏర్పడటానికి ఒక కారణం లేదు, కానీ కొన్ని అంశాలు దీనికి దోహదం చేస్తాయి. ముందుగా, తగినంత నీరు తాగకపోవడానికి ప్రధాన కారణం. మూత్రం దట్టంగా మారి, పదార్థాలు కలిసి రాళ్లుగా మారతాయి. అలాగే, ఆహారంలో ఉప్పు, ప్రోటీన్, షుగర్ ఎక్కువగా తీసుకోవడం కూడా ప్రమాదం. ఉదాహరణకు, మాంసాహారం ఎక్కువ తినేవారిలో యూరిక్ ఆమ్లం రాళ్లు ఏర్పడే అవకాశం ఎక్కువ.
కుటుంబ చరిత్ర: మీ కుటుంబంలో ఎవరికైనా కిడ్నీలో రాళ్ల సమస్య ఉంటే, మీకు కూడా రావచ్చు.
ఊబకాయం: అధిక బరువు ఉండటం వల్ల మెటబలిజం మారి రాళ్లు ఏర్పడతాయి.
జీర్ణ సమస్యలు: గ్యాస్ట్రిక్ బైపాస్ సర్జరీ లేదా ఇన్‌ఫ్లమేబౌల్ డిసీజ్ స్థిర కాల్షియం శోషణను ప్రభావితం చేస్తుంది.
జాగ్రత్తలు: విటమిన్ సి అధిక మోతాదు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (NIH)రోజుకు 2,000 mg కంటే ఎక్కువ తినకూడదని సిఫార్సు చేసింది..పెద్దలు విటమిన్ సి , రోజుకు 2000 మిల్లీగ్రాముల కంటే ఎక్కువగా తీసుకుంటే మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి.విటమిన్ సి ఆక్సలేట్ రూపంలోకి జీవక్రియ జరుగుతుంది, తరువాత కాల్షియం ఆక్సలేట్ తో బంధిస్తుంది మరియు మూత్రపిండాలలో కాల్షియం ఆక్సలేట్ రాళ్లను ఏర్పరుస్తుంది..

సోడియం తగ్గించుకోవడం

సోడియం అధికంగా ఉండే ఆహారం మూత్రపిండాల్లో రాళ్లను ప్రేరేపిస్తుంది ఎందుకంటే అదనపు సోడియం మూత్రంలో కాల్షియం మొత్తాన్ని పెంచుతుంది. కాబట్టి, కిడ్నీలో రాళ్లను ప్రేరేపించడాన్ని పరిష్కరించడానికి సోడియంను పరిమితిలో ఉపయోగించమని సిఫార్సు చేయబడింది. ప్రస్తుతం రోజుకు 2300 mg (మిల్లీగ్రాములు) సోడియం తీసుకోవడం మంచిది అని అధ్యయనాలు సూచిస్తున్నాయి. కిడ్నీలో రాళ్లు సోడియం వల్ల ఏర్పడినట్లయితే, రోజువారీ 1,500 మి.గ్రా.కి పరిమితం చేయడం మంచిది. సోడియం పరిమితి అధిక రక్తపోటు మరియు గుండె జబ్బులను రాకుండా కూడా ఉపయోగపడుతుంది. ప్రతిరోజూ 2 నుండి 3 లీటర్ల నీరు తాగాలని నిర్ధారించుకోండి. వీలైతే, టీ, కాఫీ, శీతల పానీయాల వినియోగాన్ని తగ్గించండి. మీ ఆహారంలో ఉప్పునీ తగ్గించండి ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉండండి. ముఖ్యంగా ఇంట్లో వండిన ఆహారాన్ని తినండి. మీ ఆహారంలో పండ్లు - కూరగాయలను చేర్చుకోండి. కిడ్నీ రాళ్లు సాధారణ సమస్య, కానీ ముందుగా గుర్తిస్తే సులభంగా తగ్గించుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకోండి... మీకు ఏమైనా సమస్య ఉంటే.. వెంటనే వైద్యులను సంప్రదించండి



డా. కౌశల్ గోవర్ధన
ఏం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదరాబాద్
7702417779

భారత్, పాక్ అణు యుద్ధాన్ని నేనే ఆపా

- లేకుంటే 3.5 కోట్ల మంది మరణించేవారు
- స్టేట్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: భారత్‌పాక్ మధ్య అణు యుద్ధం సహా ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను తాను ఆపినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను కనుక తాను ఆపకపోయి ఉంటే 3.5 కోట్ల మంది ప్రజలు మరణించి ఉండే వారని పాక్ ప్రధాని షరీఫ్ తనతో పేర్కొన్నారని తెలిపారు. అమెరికాకు స్వర్ణయుగం మళ్లీ ప్రారంభమైందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను సమర్థించారు. 2026 స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. అలాగే భారత్‌పాక్ యుద్ధాన్ని తానే ఆపినట్లు పునరుద్ఘాటించారు. అలాగే అణు ఒప్పందం చేసుకోకపోతే దాడులు తప్పవ్ అంటూ హెచ్చరించారు. 'అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి 10 నెలల్లోనే నేను ఎనిమిది యుద్ధాలు ముగించా. కంబోడియా థాయ్‌లాండ్, పాకిస్థాన్ భారత్ మధ్య అణు యుద్ధం జరిగేదే. నా జోక్యం లేకపోతే 3.5 కోట్ల మంది చనిపోయేవారని పాకిస్థాన్ ప్రధాని అన్నారు. నేను అధ్యక్షుడిగా ఉన్నట్లయితే రష్యా ఉక్రెయిన్ యుద్ధం జరిగేది కాదు. రెండు దేశాల మధ్య జరుగుతున్న హింసను ఆపేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది' అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే భారత్ యుద్ధాన్ని ప్రస్తావిస్తున్నప్పుడు తను లేకపోతే పాక్ ప్రధాని చనిపోయి ఉండేవారని ట్రంప్ నోరు జారారు. కానీ వెంటనే 3.5 కోట్ల మంది యుద్ధంలో చనిపోయేవారని పాక్ ప్రధాని తనతో చెప్పినట్లు వెల్లడించారు. ఇరాన్ తన అణు, క్షిపణి సామర్థ్యాలను పెంపొందించుకునే ప్రయత్నాలను తిరిగి ప్రారంభిస్తోందని డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఇలాంటి వాటికి అనుమతించకూడదనేది అమెరికా విధానమని తెలిపారు. అయితే దౌత్యపరమైన పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తానని చెప్పినా, అవసరమైతే కఠిన నిర్ణయాలకు వెనుకాడబోనని హెచ్చరించారు. అమెరిగా గతంలోకన్నా ఇప్పుడు మెరుగ్గా సుసంపన్నంగా మారిందని డొనాల్డ్ ట్రంప్ అన్నారు.



ఢిల్లీ బాంబు పేలుడు కేసులో మరో ఇద్దరు అరెస్టు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఢిల్లీ బాంబు బ్లాస్ట్ కేసులో కీలక పరిణామం జరిగింది. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న మరో ఇద్దరిని జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ అదుపులోకి తీసుకుంది. జమ్మూ కాశ్మీర్ కు చెందిన జమీర్ అహ్మద్, తుఫాలీ అహ్మద్ గా గుర్తించారు. వీరిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎన్ఐఏ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ ఇద్దరు కూడా ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనలో ప్రధాన నిందితులకు ఆయుధాలు సరఫరా చేసినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్టుల సంఖ్య 11కి చేరుకుంది. నిందితుల్లో వైద్యులు కూడా ఉండడం గమనార్హం. అలాగే ఈ పేలుళ్ల కుట్రతో సంబంధం ఉన్న ఉమర్, ముజమ్మిల్ గనై, షాహీన్ సయీద్, ముఫ్తీ ఇర్ఫాన్, అదీల్ అహ్మద్ రాథర్‌ను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. అలాగే వీళ్లకు ఆశ్రయం ఇచ్చిన మరో ఐదుగురు నిందితులు కూడా ప్రధాన కుట్రదారులేనని, వీళ్లందరికీ నిషేధిత ఉగ్రవాద సంస్థలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో ఈ తొమ్మిది మందిని జమ్మూ కాశ్మీర్, హరియాణాలోని వివిధ ప్రాంతాల నుంచి పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. కాగా, 2025 నవంబర్ 10న దేశ రాజధాని ఢిల్లీ ఎర్ర కోట మెట్రో స్టేషన్ సమీపంలో బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 11 మంది మరణించగా, అనేక మంది గాయపడ్డారు. ఇందులో బాంబు పేలుడుకు కారణమైన ప్రధాన నిందితుడు ఉమర్ ఉన్ నబీ కూడా మృతి చెందాడు. దీనిపై జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేపడుతోంది. అలాగే ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్, క్రైమ్ బ్రాంచ్ లాంటి సంస్థలు కూడా విస్తృత స్థాయిలో దర్యాప్తు చేస్తున్నాయి.

'న్యాయ వ్యవస్థలో అవినీతి'పై 8వ తరగతి బుక్‌లో ఛాప్టర్

- సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి కొత్త సోషల్ సైన్స్ టెక్స్ట్ బుక్‌లో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' అనే అధ్యాయాన్ని చేర్చడంపై సుప్రీం కోర్టు స్పందించింది. బుధవారం ఈ అంశాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఇలాంటి అంశంపై సోషల్ సైన్స్ పుస్తకంలో అధ్యాయాన్ని చేర్చడం తీవ్ర ఆందోళనకర అంశమని దేశ సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సీనియర్ అడ్వకేట్లు కపిల్ సిబాల్, అభిషేక్ ఎం సింఘ్వి ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 8వ తరగతి పిల్లలకు న్యాయ వ్యవస్థలో అవినీతిపై పాఠాన్ని చెప్పబోతున్నారని, ఇది చింత కలిగించే అంశమని వారు తెలిపారు. బ్యూరోక్రసీ, రాజకీయాల్లో ఉన్న అవినీతి గురించి ఒక్క అంశాన్నీ ప్రస్తావించకుండా, కేవలం న్యాయవ్యవస్థలోనే అవినీతి జరుగుతోందని అన్నట్టుగా విద్యార్థులకు చూపించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. దీన్ని సుమోటోగా స్వీకరించాలని సుప్రీంకోర్టు బెంచ్‌కు సిబల్, సింఘ్వి విన్నవించారు. దీనిపై ఘాటుగా స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయవ్యవస్థకు అపకీర్తిని తెచ్చే అవకాశాన్ని తాను ఎవ్వరికీ ఇవ్వనని తేల్చి చెప్పారు. చట్టం తన పనిని తాను చేసుకుపోతుందని ఆయన స్పష్టం చేశారు. దేశ న్యాయ వ్యవస్థకు అధిపతిగా తన పనిని తాను చేశానని, న్యాయ వ్యవస్థలో అవినీతి అనే ఛాప్టర్‌ను సుమోటోగా సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకున్నానని వెల్లడించారు. ఇలాంటి అంశంపై సోషల్ సైన్స్ టెక్స్ట్ బుక్‌లో ఛాప్టర్‌ను చేర్చడం అనేది ఉద్దేశపూర్వక, ప్రణాళికాబద్ధ చర్యలాగే కనిపిస్తోందని, దీనిపై ఇంకా ఎక్కువ మాట్లాడలేనని సీజేఐ అన్నారు. ఈ అంశాన్ని సుప్రీం కోర్టు దృష్టికి తీసుకొచ్చినందుకు కపిల్ సిబల్, అభిషేక్ ఎం సింఘ్విలను ఆయన అభినందించారు.









భారత్‌కు అసలైన పరీక్ష

- నేడు జింబాబ్వేతో చావో రేవో మ్యాచ్

టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. సెమీఫైనల్ బెర్తు దక్కించుకోవాలంటే తప్పక గెలువాల్సిన స్థితిలో టీమ్‌ఇండియా కొట్టుమిట్టాడుతున్నది. ఇప్పటికే దక్షిణాఫ్రికా చేతిలో భారీ ఓటమితో సెమీస్ అవకాశాలను క్లిష్టం చేసుకున్న సూర్యకుమార్‌యాదవ్ సేన..గురువారం జింబాబ్వేతో కీలక పోరులో తలపడనుంది. మెగాటోర్నీలో ముందంజ వేయాలంటే మిగతా జట్ల గెలుపు, ఓటములపై ఆధారపడాల్సిన పరిస్థితి కొని తెచ్చుకున్న టీమ్‌ఇండియా ముందంజ వేయాలంటే శక్తికి పోరాడాల్సి ఉంది. పొట్టి ఫార్మాట్ లో ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ డిఫెండింగ్ చాంపియన్‌గా ప్రపంచకప్‌లో అడుగుపెట్టిన భారత్ అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోతున్నది. మెగాటోర్నీకి ముందు మన బ్యాటర్లు పరుగుల వరద పారిస్తూ భారీ స్కోర్లు నమోదు చేయగా, ప్రస్తుతం ఘోరంగా తడబడుతున్నారు. ఇదిలా ఉంటే టోర్నీలో అంతోఇంతో రాణిస్తున్న ఇషాన్ కిషన్..అభిషేక్‌ను అనుసరిస్తూ దక్షిణాఫ్రికాతో పోరులో సున్నా చుట్టాడు. భారీ అంచనాలు పెట్టుకున్న ఆసియాకప్ హీరో తిలక్‌వర్మ బ్యాటు ఝులిపించలేకపోతున్నాడు. ముగ్గురు లెఫ్ట్‌హ్యాండర్లతో కూడిన టాప్3 బ్యాటింగ్ ఆర్డర్ లోపాలను అంచనా వేసిన ప్రత్యర్థి జట్లు స్పిన్‌తో దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీనియర్ శాంసన్ తీసుకుంటే లెఫ్ట్‌రైట్ కాంబినేషన్‌లో దాడికి దిగవచ్చని మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నది. సుందర్ స్థానంలో అక్షర్‌పటేల్ రాక ఖరారు కాగా, ఎక్స్‌ట్రా స్పిన్నర్ రూపంలో కుల్దీప్‌యాదవ్‌ను తీసుకునే అవకాశముంది. తిలక్, రింకూ ఇద్దరిలో ఒకరిని పక్కకు పెడుతూ శాంసన్ తుది జట్టులోకి తీసుకోనున్నారు. బౌలింగ్‌లో బుమ్రా, అర్ష్‌దీప్‌సింగ్ రాణిస్తున్నా..వరుణ్ నిలకడ ప్రదర్శించలేకపోతున్నాడు. మరోవైపు జింబాబ్వే మెగాటోర్నీలో మేటి జట్లకు షాక్ ఇస్తూ సూపర్ 8లోకి అడుగుపెట్టింది. లీగ్ దశలో ఆస్ట్రేలియా, శ్రీలంకను ఓడించిన జింబాబ్వే..వెస్టిండీస్‌ను దీటుగా ఎదుర్కొలేకపోయింది. ఓవైపు భారీ హిట్టర్లకు తోడు పేస్, స్పిన్నర్లతో జింబాబ్వే సమతూకంగా కనిపిస్తున్నది. చెన్నైలో ఎవరిది పైచేయి అవుతుందనేది చూడాలి.

అదరగొట్టిన న్యూజిలాండ్

- చావోరేవో మ్యాచ్ లో శ్రీలంకపై గెలుపు

టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ అదరగొట్టింది. బ్యాట్ తో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా బంతితో మాత్రం ప్రత్యర్థికి చుక్కలు చూపించి సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది. గ్రూప్ 2లో భాగంగా కొలంబోలో శ్రీలంకతో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో లంకేయులపై 61 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' రచిన్ రవీంద్ర ఆల్‌రౌండ్ షో (బ్యాట్ తో 22 బంతుల్లో 32, బంతితో 4/27)తో ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. మ్యాచ్‌లో లంక ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్‌కు వచ్చిన న్యూజిలాండ్.. నిర్ణీత ఓవర్లలో 168/7కే పరిమితమైంది. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (26 బంతుల్లో 47, 2 ఫోర్లు, 4 సిక్సులు), రచిన్‌తో పాటు మెక్‌కాంచి (23 బంతుల్లో 31 నాటౌట్, 3 ఫోర్లు, 2 సిక్సులు) రాణించారు. తీక్షణ, చమీర చెరో మూడు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో లంక.. 20 ఓవర్లలో 107/8 వద్దే ఆగిపోయింది. కమిందు మెండిస్ (31) టాప్ స్కోరర్. గ్రూప్ 2లో ఇంగ్లండ్ ఇప్పటికే సెమీస్‌కు చేరగా తాజా విజయంతో కివీస్ కూడా ఆ రేసులో ముందంజ వేసింది. దీంతో శ్రీలంక అధికారికంగా టోర్నీ నుంచి నిష్క్రమించగా పాక్ అవకాశాలూ దాదాపుగా ముగిసినట్టే! ఛేదనలో మొదటి బంతికే వికెట్ కోల్పోయిన లంకేయులు.. ఏ దశలోనూ లక్ష్యం వైపుగా సాగలేదు. ఫస్ట్ బాల్‌కే పతుమ్ నిస్సంకను క్లీన్‌బౌల్డ్ చేసిన మాథ్యూ హెన్రీ.. మూడో ఓవర్లో అసలంక (5)నూ ఔట్ చేసి లంకను ఆదిలోనే చావుదెబ్బ తీశాడు. దీంతో ఆత్మరక్షణలో పడిన లంకేయులు.. డిఫెన్స్‌కే ప్రాధాన్యమివ్వడంతో పవర్ ప్లేలో ఆ జట్టు 20/2 పరుగులు మాత్రమే చేయగల్గింది. ఇక 9వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన పార్ట్‌టైమ్ స్పిన్నర్ రచిన్.. వరుస ఓవర్లలో మ్యాచ్ గమనాన్ని పూర్తిగా కివీస్‌కు అనుకూలంగా మార్చేశాడు. 13 బంతుల వ్యవధిలో కుశాల్ (11), రత్నాయకె (10), కెప్టెన్ శనక (3), హేమంత (3)ను బోల్తా కొట్టించి లంక పతనాన్ని శాసించాడు. అతడి స్పిన్ మాయతో ఆతిథ్య జట్టు పరాభవం ఖరారైంది. కమిందు, వెల్లలాగె (29) కొద్దిసేపు పోరాడినా వారి పోరాటం లంక ఓటమి అంతరాన్ని తగ్గించిందంతే. బౌలర్లకు సహకరించిన కొలంబో పిచ్‌పై లంక బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీసి కివీస్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచడంతో ఆ జట్టు ఇన్నింగ్స్ ఒడిదొడుకుల నడుమ సాగింది. ఫిన్ అలెన్ (13 బంతుల్లో 23, 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులతో 3 ఓవర్లకే 30/0తో కివీస్ ధాటిగానే ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టింది. కానీ స్పిన్నర్ తీక్షణ, పేసర్ చమీర వరుస ఓవర్లలో ప్రత్యర్థిని దెబ్బ తీశారు. నాలుగో ఓవర్లో బంతినందుకున్న తీక్షణ.. తొలి బంతికే అలెన్‌ను ఔట్ చేసి వికెట్ల ఖాతా తెరిచాడు. మరుసటి ఓవర్లో చమీర.. సీఫర్ట్ (8)ను వెనక్కి పంపాడు. ఈ క్రమంలో రచిన్, ఫిలిప్స్ (18) నాలుగో వికెట్‌కు 41 రన్స్ జోడించారు. క్రీజులో కుదురుకుంటున్న ఫిలిప్స్‌ను రెండో స్పెల్‌కు వచ్చిన చమీర.. క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఇక 12వ ఓవర్లో తీక్షణ రచిన్, చాప్‌మన్‌నూ ఔట్ చేసి కివీస్‌ను కోలుకోనీయకుండా చేశాడు. తర్వాతి ఓవర్లోనే వెల్లలాగె.. మిచెల్ (3)ను బోల్తా కొట్టించడంతో ఆ జట్టు 84/6తో నిలిచింది. ఈ స్థితిలో అసలు ఆ జట్టు 120 పరుగులైనా చేయగల్గుతుందా? అనుకుంటున్న తరుణంలో మెక్‌కాంచితో కలిసి కెప్టెన్ శాంట్నర్ కివీస్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. 16 ఓవర్లకు 98/6తో ఉన్న న్యూజిలాండ్.. 168 చేసిందంటే అది ఈ ఇద్దరి చలవే. ఈ ద్వయం సిక్సులు, బౌండరీలతో రెచ్చిపోయి ఆఖరి 4 ఓవర్లలో 70 పరుగులు పిండుకుంది. అంతేగాక ఏడో వికెట్‌కు 47 బంతుల్లోనే 84 రన్స్ జోడించి కివీస్‌కు మెరుగైన స్కోరునందించింది.



పాకిస్తాన్ ఆటగాళ్లకు నిరసన సెగ

టీ 20 ప్రపంచకప్‌లో భాగంగా సూపర్ 8లో ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఓడిన అనంతరం పాకిస్థాన్ క్రికెటర్లకు స్వదేశంలో నిరసన సెగ తగులుతున్నది. ఈ మ్యాచ్‌లో ఓటమితో పాక్ సూపర్ 8 ఆశలు దాదాపుగా ఆవిరయ్యాయి. దీంతో పాక్ క్రికెటర్లతో పాటు సారథి సల్మాన్ అలీ అఘా కుటుంబాలను టార్గెట్ చేస్తూ కొంతమంది నెటిజన్లు అభ్యంతకర పదజాలంతో సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. అఘా, అతడి భార్య, కుమారుడిని దూషిస్తూ పోస్టులు పెట్టారు. దీనిపై అఘా భార్య సబ్బా మన్జెర్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో స్పందిస్తూ.. 'నన్ను, అమాయకుడైన నా కొడుకును తిట్టినంత మాత్రానా ప్రపంచకప్‌లో పాకిస్థాన్ టైటిల్ గెలువదు' అని రాసుకొచ్చింది.



జింబాబ్వేతో మ్యాచ్ లో సంజూకు చాన్స్

టీ20 వరల్డ్ కప్, సూపర్ 8లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచులో ఇండియా ఘోర పరాజయం పొందిన సంగతి తెలిసిందే. అయితే, ఈ మ్యాచులో ఓటమితో టీమిండియాలో మార్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా యంగ్ ఓపెనర్ సంజూ శాంసన్ జట్టులో తిరిగి చేరే అవకాశాలున్నాయి. సంజూ శాంసన్‌ను ఆడించే అంశంపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయాలని టీం భావిస్తోంది. ఇటీవల టీమిండియా బ్యాటింగ్‌లో విఫలమవుతోంది. ముఖ్యంగా బ్యాటర్లు త్వరగా వికెట్లు కోల్పోతున్నారు. తొలి ఓవర్లలోనే వికెట్లు పోతున్నాయి. దీంతో భారత్ భారీ స్కోరు సాధించలేకపోతుంది. అందుకే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సితాన్షు కోటక్ తెలిపాడు. బ్యాటింగ్‌కు సంబంధించి లెఫ్ట్ హ్యాండర్లు ఎక్కువగా ఉన్నారు. అందుకే రైట్ హ్యాండర్ అయిన సంజూను ఆడిస్తే మెరుగైన ఫలితం ఉంటుందని కోటక్ ఆలోచిస్తున్నాడు. సంజూను తీసుకుంటే ఒక లెఫ్ట్ హ్యాండర్, ఒక రైట్ హ్యాండర్ బ్యాటింగ్ చేస్తారు. ఇది మంచి ఫలితం ఇస్తుందని జట్టు యోచన. ప్రస్తుతం సంజూతో నెట్స్‌లో బాగా ప్రాక్టీస్ చేయిస్తున్నారు. దీనర్థం సంజూ తుది జట్టులో ఆడటం గ్యారెంటీ అని కాదని కోటక్ అన్నాడు.




రగ్డ్ లుక్‌లో శార్వానంద్

'భోగి' ఫస్ట్ లుక్ రిలీజ్

చార్మింగ్ స్టార్ శర్వా తొలిసారిగా యాక్షన్ మావెరిక్ సంపత్ నందితో కలిసి భారీ పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా భోగి సినిమా చేస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కెకె రాధామోహన్ ఎపిక్ స్కేల్‌లో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఈ చిత్రం శర్వా కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన వెంచర్‌లలో ఒకటిగా రూపొందుతోంది. ఈరోజు మేకర్స్ ఇంటెన్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్‌లో శర్వా ఇప్పటివరకు కనిపించని రగ్గడ్, ఫెరోషస్ మాస్ అవతార్‌లో కనిపిస్తున్నారు. రగ్గడ్ గడ్డం, మీసం, కర్లింగ్ జుట్టుతో రా & రఫ్ లుక్‌లో కనిపించడం అదిరిపోయింది. భారీ మాచెట్ లాంటి ఆయుధం వెనుక కూర్చుని ఉన్న శర్వా లుక్, సినిమాలోని హింసాత్మక ప్రపంచాన్ని సూచిస్తుంది. ఎంబర్స్, స్పార్క్స్‌తో నిండిన డార్క్ బ్యాక్‌డ్రాప్ సినిమాకి "A Blood Fest" ట్యాగ్‌లైన్ పర్ఫెక్ట్ యాప్ట్. ఈ సినిమాకోసం శర్వా పూర్తిగా ట్రాన్స్‌ఫార్మేషన్ అయ్యారు. ఇది ఆయనలోని కొత్త కోణాన్ని చూపించే కంప్లీట్ రీ ఇన్వెన్షన్. ప్రతి ఫ్రేమ్‌లోనూ శర్వా 'బీస్ట్ మోడ్'లోకి అడుగుపెడుతున్నారని స్పష్టమవుతోంది. డైరెక్టర్ సంపత్ నంది ఈ చిత్రాన్ని 1960ల కాలంలో ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ సెట్ పై ముఖ్యమైన యాక్షన్ సీక్వెన్స్‌లు చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ స్టంట్ మాస్టర్ దిలీప్ సుబ్బరాయన్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌లను డిజైన్ చేశారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు.

నాగ చైతన్య వృషకర్మ



తండేల్ బ్లాక్ బస్టర్ విజయంతో అద్భుతంగా సాగుతున్న యువ సామ్రాట్ నాగ చైతన్య, తన తొలి బ్లాక్‌బస్టర్ 'విరూపాక్ష'తో ఆకట్టుకున్న ఫిల్మ్ మేకర్ కార్తీక్ దండుతో కలిసి ప్రతిష్టాత్మక మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' చేస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని SVCC, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి, బాపినీడు ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తున్నారు. బిహైండ్ ది సీన్ వీడియోలు, ఫస్ట్ లుక్ తో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. మేకర్స్ సినిమా ఫస్ట్ గ్లింప్స్ గురించి అప్‌డేట్ ఇచ్చారు. గ్లింప్స్ వృషకర్మ ఆధ్యాత్మిక ప్రపంచంలోకి మొదటి స్నీక్ పీక్ ఇవ్వడానికి మార్చి 5న విడుదల కానుంది. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో నాగ చైతన్య ఒక చీకటి గుహలో నిలబడి, పైనుండి దూసుకు వస్తున్న పదునైన కాంతి కిరణాలతో తడిసి ముద్దవుతున్నట్లు కనిపిస్తోంది. అతని కండలు తిరిగిన శరీరం, ఇంటెన్స్ లుక్ అద్భుతంగా వుంది. నడుముకు కట్టుకున్న క్లైంబింగ్ గేర్, చేతిలో ఉన్న తవ్వే ఆయుధం అతని పాత్ర ఎంత ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లిందో సూచిస్తున్నాయి. చుట్టూ ఉన్న రాళ్లు, తాళ్లు, అసమానమైన భూభాగం ఈ కథలో అడ్వెంచర్, థ్రిల్ స్థాయిని మరింత పెంచుతున్నాయి.




ఫ్యామిలీతో కలిసి నవ్వుకోడానికి థియేటర్స్ కి రండి

విష్ణు విన్యాసం ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ లో శ్రీ విష్ణు

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు హిలేరియస్ జాయ్‌రైడ్ 'విష్ణు విన్యాసం'తో అలరించబోతున్నారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్ గా నటిస్తోంది. ఇపటికే ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఫిబ్రవరి 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ లో కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం, విష్ణు విన్యాసం సినిమా మొదలవడానికి మొదటి కారణం చారి గారు. ఆయన ద్వారానే మారుతి పరిచయమయ్యారు. కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది. అలాగే మన నిర్మాతలు సుబ్రమణ్యం గారు సుమంత్ గారు సినిమాని అద్భుతంగా ప్రొడ్యూస్ చేశారు. వారితో కలిసి పని చేయడం చాలా హ్యాపీగా ఉంది. మాకు చాలా ఫ్రీడం ఇచ్చారు. వారి బ్యానర్ నుంచి వస్తున్న ఈ సినిమా కోసం చాలా ప్రౌడ్ గా చెప్పుకుంటారు. చాలా రోజులు గుర్తుంటుంది. మా టెక్నీషియన్స్ డీవోపీ సాయి శ్రీరామ్ ఎడిటర్ కార్తీ, మ్యూజిక్ రధన్ అందరికీ థాంక్యు. ఈ సినిమాలో పనిచేస్తున్న ప్రతి నటీనటులకు థాంక్యూ సో మచ్. నయన్ సారిక చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్. తను ముందు ముందు మరింత మంచి స్థాయికి వెళ్తుందని నమ్ముతున్నాను. దర్శకుడు మారుతి చాలా కూల్ గా ఉంటాడు. చాలా మంచి మనిషి. సినిమా తప్పితే మరో ప్రపంచం తెలీదు. విష్ణు విన్యాసం ఫస్టాఫ్ అంతా యూత్ కి బాగా కనెక్ట్ అవుతుంది. సెకండ్ హాఫ్ కి సినిమా ఫ్యామిలీ డ్రామాగా మారుతుంది. సినిమా పూర్తి అయ్యేసరికి ఒక మంచి సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. ఇది ష్యూర్ షాట్ సూపర్ హిట్ సినిమా. హ్యాపీగా ఫ్యామిలీతో కలిసి నవ్వుకోడానికి రండి. 100% నవ్వుకుంటారు. ఆ బాధ్యత నాది.'అన్నారు.

ముందు చూపు ఉండాలి

గ్లామర్ ప్రపంచంలో వెలుగులు ఎప్పటికీ నిలవవని, స్టార్‌డమ్ శాశ్వతం కాదని టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా చేసిన తాజా వ్యాఖ్యలు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అవకాశాలు వరుస పెడుతున్నప్పడే ఫ్యూచర్ గురించి ఆలోచించాలి, లేకపోతే కెరీర్ చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు తప్పవని ఆమె స్పష్టం చేయడం సినీ ఇండస్ట్రీ రియాలిటీకి ఒక రియల్ చెక్‌లా మారింది. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూసుకోవాలి 15 ఏళ్ల వయసులోనే వెండితెరకు పరిచయమైన తమన్నా గత రెండు దశాబ్దాలుగా అగ్ర హీరోల సరసన నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అయితే ఈ ప్రయాణం కేవలం గ్లామర్, హిట్ సినిమాల వరకే పరిమితం కాలేదని ఆమె చెబుతున్నారు. చేతి నిండా సినిమాలు ఉన్నప్పడే సంపాదనను సరైన దిశలో మళ్లించాలని, నటీనటుల కెరీర్ ఎప్పుడెప్పుడు మలుపు తిరుగుతుందో చెప్పలేమని, కాబట్టి ముందుగానే ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను ఏర్పరుచుకోవాలంటూ ఆమె చెప్పిన మాటలు ఇండస్ట్రీలోని అస్థిరతను స్పష్టంగా చూపిస్తున్నాయి. అవకాశాలు తగ్గాక ఆర్థిక సమస్యలు తప్పవు సినిమా రంగం వెలుగుల ప్రపంచమే అయినా, అవకాశాలు తగ్గిన తర్వాత చాలామంది కళాకారులు ఎదుర్కొనే ఆర్థిక సమస్యలు కొత్తవి కావు. ఒకప్పుడు టాప్‌లో ఉన్నవారు కూడా తరువాతి కాలంలో ఇబ్బందులు పడిన సంఘటనలు చాలానే చూశాం. ఈ నేపథ్యంలో తమన్నా చేసిన వ్యాఖ్యలు యువ నటీనటులకు హెచ్చరికలా మారాయి.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200